# దాహం తీర్చండి మహాప్రభో...

(మొదటిపేజీ తరువాయి)

బలపాలతిప్ప, జానాల గూడేలతో పాటు పెచ్చెర్వు, ఎదురుపాడు, ఎర్రగుంట్ల వంటి గూడేల్లో సోలార్ ద్వారా ట్యాంకులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఫలితంగా చెంచులు గ్రామాలు, గూడేల శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ బావులు, కుంటలను ఆశ్రయించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడింది. కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు, ఎర్రగుంట్ల చెంచు గూడేల్లో మంచి నీటి కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ గూడేల్లో పది రోజులుగా మంచి నీరు రావడం లేదు. ఎదురుపాడు గూడెంలో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్యాంక్ పగిలిపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఎర్రగుంట్ల గూడెంలో ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటికి పైప్ లైన్లు వేయలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

# 28న అమ్మఒడి నిధులు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

మాగాణి భూమి 3 ఎకరాల్లోపు, రెండూ కలిపి ఉంటే 10 ఎకరాల్లోపు ఉండాలి. విద్యుత్తు వినియోగం నెలకు 300లోపు యూనిట్లు ఉండాలనే నిబంధన విధించింది. నాలుగు చక్రాల వాహన యజమానులకు సంబంధించి డ్రైవర్లు సొంతంగా నడుపుకునే ట్యాక్సీలతో పాటు ట్రాక్టర్లు, ఆటోలకు కూడా మినహాయింపునిచ్చింది. వీరు అమ్మఒడి పథకానికి అర్హులే. పట్టణాల్లో స్థిరాస్తికి సంబంధించి ఇంటి విస్తీర్ణం 1,000 చదరపు అడుగులు మించకుండా ఉంటే అమ్మఒడిని వర్తింపజేస్తారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ కాకుండా పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి కోర్సుల్లో చేరేవారికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేస్తారు.

# మరో నాలుగు రోజులు మంటలే

(మొదటిపేజీ తరువాయి)

రెండో వారం నాటికి నైరుతి రుతుపవనాలు వాతావరణాన్ని చల్లబరిచేవి. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మరో నాలుగు రోజులు అధిక ఉష్ణోగ్రతలు తప్పవని వాతావరణ శాఖ సంచాలకురాలు స్టెల్లా స్పష్టం చేశారు. 21వ తేదీ నాటికి వాతావరణంలో మార్పులు వస్తాయని ఆమె వివరించారు. ఏటా రాజస్థాన్ నుంచి వేడిగాలులు బలంగా వీస్తాయి. వాటి ప్రభావంతోనే తెలుగు రాష్ట్రాల్లోనూ వడగాలులు వీస్తాయి. ప్రస్తుతం ఉత్తర, పశ్చిమ దిశ నుంచి వేడిగాలులు తెలుగు రాష్ట్రాలవైపు వస్తున్నాయి. ఈ ప్రభావం ఇప్పుడు ఎక్కువగా పడుతోంది. ఈ కారణంగానే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరికలు జారీ చేశాం. విజయవాడ, అమరావతి ప్రాంతాల్లో 43 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఈ వేడి తప్పదు. వాస్తవానికి జూన్ రెండో వారంలోనే రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలను తాకుతాయి. ఉత్తరాదిలో బయల్దేరిన బిపర్‌జాయ్ తుఫాను ప్రభావం రుతుపవనాలపై తీవ్రంగా పడింది. ఈ కారణంగా రుతుపవనాలు చెల్లాచెదురు అయ్యాయి. ఈనెల 21వ తేదీన రుతుపవనాలు కృష్ణా, గుంటూరు జిల్లాలను తాకే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు అడుగుపెట్టాయి. ప్రస్తుతం సత్యసాయి జిల్లాకు, సూళ్లూరుపేటకు మధ్య కేంద్రీకృతమయ్యాయి. సాధారణంగా జూన్ 5వ తేదీ నాటికి గుంటూరు, కృష్ణాజిల్లాలను తాకుతాయి. 13వ తేదీకి ఉత్తరాంధ్ర జిల్లాలను తాకుతాయి. ఈ సైకిల్ ఇప్పుడు గతి తప్పింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు అరేబియా సముద్రంలో ఏర్పడతాయి. ఈ గాలులు సముద్రంలోనూ, ఉపరితలంలోనూ బలంగా ఉండాలి. సముద్రానికి మూడు మీటర్ల ఎత్తులో ఈ గాలులు ఏర్పడాలి. అప్పుడే రుతుపవనాలు వేగంగా ముందుకు కదులుతాయి. ఈ ఏడాది ఆవిధంగా జరగలేదు. గడిచిన వందేళ్లలో అరేబియన్ సముద్రంలో ఇంత తీవ్రమైన తుఫాన్ రాలేదు. ఈ గాలులను తుఫాన్ లాక్కుపోయింది. దానివల్లే అధిక ఉష్ణోగ్రతలు, రుతుపవనాల రాక ఆలస్యమైంది.

# ఎయిర్ ఫోర్స్ అకాడమికి రాష్ట్రపతి

(మొదటిపేజీ తరువాయి)

సౌందరరాజన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. భారత వైమానిక దళం (ఎంఈ)లోని వివిధ శాఖలకు చెందిన ఫ్లైట్ క్యాడెట్‌ల ఛాలెంజింగ్ ప్రీ-కమిషనింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసినందుకు గుర్తుగా పూర్తి సైనిక వైభవంతో 211వ కోర్సు అఉఖ ంఈంలో నిర్వహించబడుతుందని రక్షణ శాఖ వెల్లడించింది. శిక్షణ పొందిన 119 ఫ్లైయింగ్ ఎయిర్ ట్రైనీ క్యాడెట్లు ఉండగా, వీరిలో 75 మంది గ్రౌండ్ డ్యూటీ ట్రైనీ క్యాడెట్లు ఉన్నారు. వీరితో పాటు శిక్షణ పొందిన మరో 8 మందితో పాటు, ట్రైనింగ్ పొందిన వారిలో ఇద్దరు వియత్నాం దేశానికి చెందిన క్యాడెట్లు కూడా ఉన్నారు. పాసింగ్ అవుట్‌కి రివ్యూయింగ్ అధికారిగా వచ్చారు ద్రౌపది ముర్ము. ఈ పరేడ్లో గ్రాడ్యుయేట్ అయిన వారి నుంచి గౌరవ వందనం స్వీకరించనున్నారు రాష్ట్రపతి ముర్ము.



అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

ఇక ఇకపోతే, పరేడ్‌కి రివ్యూయింగ్ అధికారిగా రాష్ట్రపతి వ్యవహరించడం ఎయిర్ ఫోర్స్ అకాడమీ చరిత్రలో ఇది మొదటి సారి. రాష్ట్రపతి ముర్ముతోపాటే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ సీఎస్ శాంత కుమారి హాజరుకానున్నారు.

# కేంద్ర బలగాల మోహరింపు ఆదేశాలపై సుప్రీంకోర్టుకు మమత సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ ఎన్నికల కోసం 48 గంటల్లోగా కేంద్ర బలగాలను మోహరించేలా చూడాలంటూ కోల్‌కతా హైకోర్టు గత బుధవారంనాడు ఎస్ఈసీకి ఆదేశాలిచ్చింది. పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో హింస చెలరేగడాన్ని హైకోర్టు ప్రస్తావిస్తూ, జూన్ 13న తాము ఆదేశాలు ఇచ్చినప్పటికీ సమర్ధవంతమైన చర్యలు తీసుకోలేదని పేర్కొంది.

## బీజేపీ ఫిర్యాదు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర బలగాలను మోహరించేలా తగిన ఆదేశాలివ్వాలంటూ బీజేపీ నేతలు సువేందు అధికారి, కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి హైకోర్టును ఇంతకుముందు ఆశ్రయించారు. 2022 మున్సిపల్ ఎన్నికల్లోనూ, 2021లో కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పెద్దఎత్తున హింస చెలరేగిన ఘటనలను తమ పిటిషన్లలో వారు కోర్టు దృష్టికి తెచ్చారు.

# ప్రొఫెసర్ హరగోపాల్ పై కేసులు తీసేయండి

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. మొత్తం అన్ని కేసుల వివరాలూ అందజేయాలని కోర్టు ఆదేశించడంతో పోలీసులు ఈ ఎఫ్ఐఆర్‌ను కోర్టు ముందు పెట్టారు. దీంతో ఈ విషయం బయటపడింది. ప్రొఫెసర్ హరగోపాల్ మావోయిస్టులకు సహాయసహకారాలు అందిస్తున్నారని, బీరెల్లి కుట్రలో ఆయన భాగం అయ్యారని, పైగా నిషేధిత మావోయిస్టుల పుస్తకాల్లో ఆయన పేరు ఉందనే అభియోగాలు నమోదు అయ్యాయి. ఇంకా మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు పుల్లూరు ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ఆయుధాల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం, ప్రభుత్వాన్ని కూలదోయడం, పార్టీకి నిధులు సమకూర్చుకోవడం, అమాయక యువకులను మావోయిస్టు పార్టీలోకి రిక్రూట్ చేసుకోవడం వంటి పనులు చేసినట్లు పోలీసులు అభియోగాలు నమోదు చేశారు. నిందితులుగా ఉన్న వారిలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ముంబై హైకోర్టు జడ్జిగా పనిచేసిన సురేశ్ (జస్టిస్ సురేశ్ ఎఫ్ఐఆర్ నమోదయ్యేనాటికే చనిపోయారు) ప్రొఫెసర్ పద్మజా షా, హైకోర్టు సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్, చిక్కుడు ప్రభాకర్ తదితరుల పేర్లు ఉన్నాయి. రాజద్రోహం, దేశద్రోహం లాంటి కేసులు పెట్టవద్దని సుప్రీం కోర్టు గతంలోనే తీర్పు ఇచ్చిందని, కాబట్టి ప్రభుత్వం పెట్టిన ఈ కేసు నిలబడదని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. మావోయిస్టులకు తమ మద్దతు ఎందుకు ఉంటుందని, వాళ్లు తమ లాంటి వాళ్ల మీద ఆధారపడరని అన్నారు. అసలు వాళ్ల ఉద్యమం వేరు అని అన్నారు. 152 మందిపైనా ఏదో ఒక కేసు పెట్టడం విషాద పరిణామం అని అన్నారు. బాధ్యతారాహిత్యంగా కేసులు పెడుతున్నారని చెప్పారు. నిజాయితీపరులపైనా.. ఆఖరికి చనిపోయిన వారిపై కూడా కేసులు పెట్టారని వాపోయారు. ఇది కాస్త బూమ్‌రాంగ్ అయ్యింది. ఈ చర్యపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విషయం రాజకీయం అవ్వడంతో ప్రభుత్వం జోక్యం చేసుకంది. సీఎం స్పందించి కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించారు. రివ్యూ చేపట్టిన సీఎం కేసీఆర్ ఉపా కేసులు ఎత్తివేతకు నిర్ణయించారు. ఈ కేసులు ఎత్తివేయాలంటూ రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను ఆదేశించారు. దీనిపై కాసేపట్లో అధికారిక సమాచారం వస్తుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# గొడవ పడద్దన్నందుకు ఇంటి ఓనర్, కూతురు హత్య

**హైదరాబాద్ :**

కుటుంబంతో సహా ఇంట్లో కిరాయికి చేరాడు.. భార్య భర్తలు నిత్యం గొడవ పడుతూ ఉండటంతో ఇల్లు ఖాళీ చేయమని అన్నందుకు పగతో రగిలి పోయాడు.. ఆ పగతోనే ఇంటి యజమాని అయిన వృద్ధురాలితో పాటు మనవరాలిని సైతం అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఇల్లు ఖాళీ చేయించిందని పగ పెంచుకున్నాడు.. అర్ధరాత్రి బాలిక సహా ఇంటి ఓనర్ దారుణ హత్య.. కుటుంబంతో సహా ఇంట్లో కిరాయికి చేరాడు.. భార్య భర్తలు నిత్యం గొడవ పడుతూ ఉండటంతో ఇల్లు ఖాళీ చేయమని అన్నందుకు పగతో రగిలి పోయాడు.. ఆ పగతోనే ఇంటి యజమాని అయిన వృద్ధురాలితో పాటు మనవరాలిని సైతం అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. హత్య అనంతరం ఇంట్లో ఉన్న బంగారంతో ఉడాయించాడు.. సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా నందిగామ గ్రామంలో డబుల్ మర్డర్ కేసును ఛేదించారు పోలీసులు. గతంలో ఇంట్లో కిరాయికి ఉన్న వ్యక్తే ఈ కిరాతకానికి పాల్పడ్డట్లు తేల్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతమ్మ నందిగామ గ్రామంలో అంగన్వాడీలో ఆయాగ పనిచేస్తూ ఉంది. పార్వతమ్మ భర్త ఏడు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈమెకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఒక కొడుకు చనిపోగా మరొక కొడుకు ఎక్కడికో వెళ్లిపోయాడు. పార్వతమ్మ ఒక్కతే తనకున్నటువంటి ఇంట్లో నివాసం ఉంటుంది. మృతురాలు పార్వతమ్మకు ఎవరూ లేనందున తన చెల్లె కొడుకు అయిన కృష్ణయ్య కూతురు భానుప్రియను ఇంట్లో పడుకోవడానికి, తనకు చేదోడువాదొడుగా ఉండటానికి పిలుచుకుంటుంది. అయితే మే నెలలో దివాకర్ సాహు అతని భార్య అంజలితో కలిసి పార్వతమ్మ ఇంట్లో అద్దెకు వచ్చారు. వీరిద్దరూ బీహార్ కు చెందినవారు దివాకర్ సాహు, అంజలి. అయితే, తరచు గొడవ పడుతుండడంతో పార్వతమ్మవారిని ఇల్లు కాలి చేయించింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న పార్వతమ్మ పై పగ పెంచుకున్నాడు దివాకర్.. పార్వతమ్మ ఇంట్లో ఉంటున్న క్రమంలో ఆమెకు ఎవరూ లేరు అని తన దగ్గర డబ్బు, బంగారు ఆభరణాలు ఉన్నట్టు గమనించాడు నిందితుడు దివాకర్..ఇల్లు ఖాళీ చేసిన అనంతరం పార్వతమ్మ ఇంటికి దగ్గరలోనే వేరే ఇంట్లోకి కిరాయికి దిగిన దివాకర్.. పార్వతమ్మ పైన పగ తీర్చుకోవడానికి సమయం కోసం ఎదురుచూస్తూ వచ్చాడు. 16వ తేదీన దివాకర్ ఇంట్లో నుండి అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో కాలకృత్యాలకు వెళుతున్నా అని భారీ అంజలితో చెప్పి పార్వతమ్మ ఇంటికి వెళ్ళాడు. అక్కడి కాంపౌండ్ కూడా దూకి .. బయట పడుకోని ఉన్న పార్వతమ్మ, ఆమె మనవరాలు భానుప్రియను ఇటుకతో తలపై కొట్టాడు. అనంతరం కత్తితో గొంతు కోసి చంపాడు దివాకర్ సాహూ. అనంతరం బీరువా తాళాలను తీసుకొని రెండు వరసల బంగారు పుస్తెలతాడు, పలు ఆభరణాలను, డబ్బులను ఎత్తుకెళ్లాడు. స్థానికుల సమాచారంతో వెంటనే పరిశీలించిన పోలీసులు ఈ కేసును ఐదు గంటల్లోనే ఛేధించారు. నాలుగు పోలీసు బృందాలు హంతకుల కోసం జల్లెడ పట్టి బిహారీ దంపతులను పట్టుకున్నాయి. కాగా.. అల్లారు ముద్దుగా పెంచుకున్న భానుప్రియను హత్య చేసిన నిందితులను ఉరిశిక్ష వేయాలని చిన్నారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.. అభం శుభం తెలియని చిన్నారిని పొట్టన పెట్టుకున్నాడంటూ కన్నీరుమున్నీరవుతున్నారు .హత్య చేసిన నిందితుడు దివాకర్ నందిగామ గ్రామ పరిధిలో ఉన్న ఎంఎస్ఎన్ కంపెనీలో వర్క్ చేస్తున్నాడు ఆ పరిసర ప్రాంతాల్లో కంపెనీలు ఉండడంతో బీహార్ ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చే వ్యక్తులు ఇక్కడి గ్రామంలో ఇళ్ళను అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు.. ఈ ఘటనతో ఎవరైనా వ్యక్తులకు ఇళ్లను అద్దెకివ్వాలంటే ఇక్కడ గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఎవరైనా అద్దెకు వస్తే వారి బయోడేటాను ఆధార్ కార్డులను తీసుకోవాల్సిందిగా పోలీసులు సూచిస్తున్నారు..

# పీఎం మిత్ర పథకానికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మోడల్

**వరంగల్:**

పీఎం మిత్ర పథకానికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మోడల్‌గా నిలిచిందని మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో యంగ్ వన్ కంపెనీ టెక్స్ టైల్ పరిశ్రమకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలోచనలు కేంద్రానికి మార్గదర్శకంగా మారాయన్నారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ దేశానికే దిక్సూచిగా మారింది. దేశంలో మున్సిపల్, పంచాయతీ అవార్డుల్లో 30 శాతం మనదేనన్నారు. 3 శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 33 శాతం అవార్డులు వస్తాయని చెప్పారు. మన దగ్గర నల్ల బంగారంతో పాటు తెల్ల బంగారం కూడా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. మన రాష్ట్రంలో పండే పత్తి దేశంలోనే అత్యధిక నాణ్యతతో ఉందన్నారు. మాకు నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్. వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ఇక్కడ ఏర్పాటయ్యే కంపెనీల్లో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామన్నారు. యంగ్‌వన్ సంస్థతో వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. దేశంలో వ్యవసాయం, జౌళి రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. వరంగల్ జిల్లాలోనే నెంబర్ వన్ పత్తి సాగవుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తెస్తాం. గణేశ కంపెనీ ఇప్పటికే రూ.600 కోట్లు పెట్టుబడి పెట్టిందని తెలిపారు. సంస్థలో వెయ్యి మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. యంగ్ వన్ కంపెనీ మొత్తం 11 పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. దీని ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఇక్కడ నిర్మించే పరిశ్రమల్లో 99 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కుతాయని చెప్పారు. వరంగల్ జిల్లాలో వస్తున్న మూడు కంపెనీల వల్ల 33 వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది. మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ పేరాలగా మారుతుందని అన్నారు. వరంగల్ లో తయారయ్యే బట్టలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. అభివృద్ధి,



సంక్షేమంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారుతోందన్నారు. మీ కోసం ఐదేళ్లు కష్టపడ్డాం, ఇప్పుడు మీరు మాకు అండగా నిలవాలన్నారు. పరకాలలో ధర్మారెడ్డిపై పోటీ చేసేందుకు విపక్షాలు భయపడి నియోజకవర్గాలు మార్చుకుని ఎక్కడికో వెళుతున్నాయన్నారు. కాకతీయ టెక్స్ టైల్ పార్కుకు భూములిచ్చిన రైతులను సన్మానిస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్, డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని స్పష్టం చేశారు. యంగ్ వన్ కంపెనీ చైర్మన్ చాంగ్ జాయ్ బోక్ మాట్లాడుతూ అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్ గా ఉందన్నారు. వరంగల్‌లో వస్త్ర పరిశ్రమ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. యంగ్ వన్ కంపెనీ లక్ష్యం నెరవేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కుపై కొందరు మూర్ఖులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకతీయ మెగా టెక్స్‌లై పార్కును ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వరంగల్ ప్రజల రుణం తీర్చుకుంటామన్నారుఐడీఓసీ నిర్మాణానికి శంకుస్థాపనవరంగల్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటించారు. గీసుకొండ మండలం శాయంపేటలో గల కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో యంగ్‌గోన్ కంపెనీ ఎవర్ టాప్ టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వస్త్ర పరిశ్రమల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. భూమిపూజ అనంతరం పార్కులో టెక్స్ టైల్ పరిశ్రమలు నిర్మిస్తున్న ఇతర ప్రతినిధులతో కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కలెక్టర్ పాల్గొన్నారు.

కాగా, అంతకుముందు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో టెక్స్‌టైల్ పార్కుకు చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు మంత్రి ఎర్రబెల్లి, యంగ్‌గోన్ కంపెనీ ప్రతినిధులు స్వాగతం పలికారు. టెక్స్‌టైల్ పార్కులో యంగ్‌గోన్ కంపెనీకి టీఎస్ఐఐసీ ఇటీవల 298 ఎకరాలు కేటాయించింది. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ తన టెక్స్‌టైల్ పరిశ్రమల్లో 11,700 మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. పరోక్షంగా మరో 11,700 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. టెక్స్‌టైల్ పార్కులో యంగ్‌గోన్ కంపెనీ రూ.840 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అనంతరం మంత్రి కేటీఆర్ ఖిలావరంగల్ వెళ్లనున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అజంజాహీ మిల్స్ గ్రౌండ్‌లో ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐడీఓసీ) నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. దేశాయిపేటలో రూ.12.60 కోట్లతో ప్రభుత్వం నిర్మించిన 200 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను, వరంగల్‌లో రూ.135 కోట్లతో చేపట్టిన 16 స్మార్ట్ రోడ్లను కేటీఆర్ ప్రారంభించనున్నారు. రూ.75 కోట్లతో వరంగల్ మోడల్ బస్ స్టేషన్, రూ.313 కోట్లతో ఇన్నర్ రింగ్ రోడ్డు శంకుస్థాపన చేశారు..

# ఫస్ట్ డే... ఫస్ట్ షో...

## వినూత్న ప్రయత్నంలో ఏపీ ఫైబర్

**విజయవాడ :**

ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ప్రజలకు మరో వెసులుబాటు కల్పిస్తోంది. పాత కొత్త సినిమాలు చూసేందుకు ఓ యాప్‌ను తీసుకొస్తోంది. ఇప్పటికే లేటెస్ట్ సినిమాలు రిలీజ్ రోజునే ఇంట్లో కూర్చొని చూసుకునేలా చేశారు. ఇప్పుడు దానికి మరింత అడ్వాన్స్‌డ్‌గా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పుడున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ మాదిరిగానే కొత్త యాప్‌కు శ్రీకారం చుట్టబోతున్నట్లు ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) ఛైర్మన్ గౌతం రెడ్డి చెప్పారు. ఈ యాప్ ద్వారా పాత, కొత్త సినిమాలు చూడవచ్చని పేర్కొన్నారు. ఈ మధ్య విశాఖలో నిరీక్షణ అనే సినిమా థియేటర్‌లో రిలీజ్ అయిన రోజే ఇంట్లో కూర్చొని చూసే అవకాశం కల్పించారు. కొత్త సినిమాను ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేయొచ్చు. దీనికి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. ఫస్ట్‌డే ఫస్ట్ షోకు మంచి స్పందన వస్తున్నందున ఇప్పుడు రెండో సినిమా కూడా ఇలా విడుదల రోజే ఫైబర్‌నెట్‌లో వేయబోతున్నారు. ఇవాళ లవ్ యూ టూ అనే సినిమాను అందిస్తున్నారు. కేవలం 39 రూపాయలకే కొత్త సినిమాను ఇంటిల్లపాది చూడవచ్చు. ఒకసారి బుక్ చేసుకుంటే 24 గంటల్లో ఎప్పుడైనా ఆ సినిమాను చూడవచ్చు. చిన్ని చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని గౌతంరెడ్డి అన్నారు. అదే టైంలో థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూడలేని ప్రేక్షకులకు తక్కువ ధరకే కొత్త సినిమాలు చూశామన్న ఆనందాన్నికూడా అందిస్తున్నామన్నారు. ఇప్పుడు తాము తీసుకున్న నిర్ణయం థియేటర్లకు, ఓటీటీ వాళ్లకు అసలు పోటీయే కాదన్నారు. ఇది కేవలం సర్వీస్ మాత్రమేనని అన్నారు. భవిష్యత్‌లో థియేటర్‌లో వేసే ప్రతి సినిమా కూడా ఫైబర్ నెట్ వినియోగదారులు వీక్షించేలా ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

# ఆచితూచి అడుగులు...

**విజయవాడ :**

2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత చంద్రబాబు బీజేపీ విషయంలో సైలెంట్ అయ్యారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాను బీజేపీపై తీవ్రంగా పోరాడినా ప్రజల మద్దతు లభించలేదు. ఇక అప్పటి నుంచి బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు నాయుడు ఎడతెగని ప్రయత్నాలు చేస్తున్న సంగతి మనందరికీ తెలిసిందే. బీజేపీ నాయకులు టీడీపీని దూరంగా ఉంచినప్పటికీ, చంద్రబాబు పట్టుదలతో వారిని వెంబడించారు. చివరగా వచ్చే ఏపీ ఎన్నికల్లో టీడీపీతో బీజేపీ చేతులు కలిపే సూచనలు కనిపిస్తున్నాయి. పొత్తులో భాగంగా బీజేపీ కనీసం 13 ఎంపీ సీట్లను అభ్యర్థిస్తోందని, 10 సీట్లు కైవసం చేసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఒక వేళ చంద్రబాబు ఈ ఒప్పందానికి అంగీకరిస్తే, ప్రస్తుతం టీడీపీకి మద్దతు ఇస్తున్న మైనారిటీ మరియు ఎస్సీ-ఎస్టీ వర్గాల ఓటర్ల నుండి మద్దతు కోల్పోయే అవకాశం ఉంది. ఒక సర్వే ప్రకారం.. ఈ మైనారిటీ, ఎస్సీ-ఎస్టీ ఓటర్లలో సుమారు 30% మంది టీడీపీకి మద్దతు ఇస్తున్నారు. వారు వైసీపీకి విధేయత చూపడం చాలా పెద్ద దెబ్బ అనే చెప్పాలి. జనసేనతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తే వైసీపీకి సవాల్‌గా మారుతుందని టీడీపీ సొంత సర్వేలు చెబుతున్నాయి. అయితే, బీజేపీ కూటమిలో చేరితే టీడీపీ కనీసం 3-4% ఓట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట సమయంలో చంద్రబాబు నాయుడు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల కలిగే నష్టాలు, వాటిని తిరస్కరించడం వల్ల కలిగే ప్రమాదాల మధ్య నలిగిపోతున్నారు కొత్త మాట చంద్రబాబు ప్రస్తుతం అనిశ్చిత స్థితిలో ఉన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావాలను కలిగించే కఠినమైన నిర్ణయాన్ని ఎదుర్కొంటున్నారు. మరోవైపు టీడీపీ పరిస్థితి కూడా చాలా దయనీయంగా ఉంది. ప్రజల్లో ఆదరణ తగ్గిపోయింది. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తికి తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఎక్కడ ఓడిపోతానేమోన్న భయం పట్టుకుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందుకే చంద్రబాబు.. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం పక్కా స్కెచ్‌లు గీస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అధికారంతో పాటు తన పార్టీకి పూర్వ వైభవం తెప్పించుకునేందుకు చంద్రబాబు చాలా కష్టపడుతున్నారు. మరో వైపు తూర్పు గోదావరి జిల్లాలో కొనసాగుతున్న వారాహి విజయ యాత్ర సంచలనాలకు కేంద్రంగా మారుతోంది. గతంలో పవన్ బహిరంగ సమావేశాల్లో, ర్యాలీల్లో పాల్గొన్నప్పుడు అధికారం వైకాపాను విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకునేవారు. ముఖ్యంగా జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించేవారు. పొత్తులతోనే తాను ముందుకు వెళ్తానని అనేవారు. కానీ మొన్నటి నుంచి ప్రారంభమైన వారాహి యాత్రలో తన మ్యానిఫెస్టోను కూడా ప్రకటించారు. కత్తిపూడిలో జరిగిన వారాహి యాత్ర అనంతరం పవన్ కాకినాడ దగ్గర ఉన్న చేబ్రోలులో రైతులు, చేనేత కళాకారులు, పట్టు రైతులతో ఆయన మాట్లాడారు. జనసేనకు ఒక్కఛాన్స్ ఇవ్వాలని, రాష్ట్రాన్ని బంగారు ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తానని చెప్పారు. దానికి కొనసాగింపుగా 2024, 2029 లో తనను ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర భవిష్యత్తును మార్చేస్తానని చెబుతున్నారు. ఒకవేళ తన పాలన నచ్చకుంటే రెండేళ్లలో తానే స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకుంటానని చెబుతున్నారు. పదేళ్లు పరిపాలించడానికి ఛాన్స్ అడిగి రెండేళ్లలో తప్పుకుంటానని పవన్ చెప్పడంపై రాజకీయ పరిశీలకులు విభిన్నంగా స్పందిస్తున్నారు. పేరుకు జగన్‌లా ఒక్క ఛాన్స్ అని అంటున్నా, తనకు రెండు ఛాన్సులు కావాలని పరోక్షంగా పవన్ అడుగుతుండటం విశేషం

# 1000 తగ్గి... 400 పెరిగిన బంగారం

**ముంబై:**

బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయని సంతోషించేలోపే మళ్లీ పెరుగుతున్నాయి. ఈ నెల 10వ తేదీ నుంచి వరుసగా 5 రోజులుగా బంగారం ధర తగ్గుముఖం పట్టింది. ఏకంగా రూ. వెయ్యి వరకు తగ్గింది. అయితే శనివారం మళ్లీ ఒక్కసారిగా బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. ఒకే రోజులో తులంపై ఏకంగా రూ. 400 పెరిగింది. దీంతో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ. 55,100గా ఉండగా, 24 క్యారెట్స్ బంగారం ధర రూ. 54,700 వద్ద కొనసాగుతోంది. ఇక ఈ రోజు దేశంలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో బంగారం ధరలో పెరుగుదల కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం ధరలు భారీగా పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గోల్డ్ రేట్స్ ఎలా ఉన్నాయంటే.. తెలంగాణ రాజధానిలో శనివారం బంగారం ధర రూ. 400 పెరిగింది. దీంతో ఇక్కడ 22 క్యారెట్ల పసిడి ధర రూ. 55,100గా ఉండగా, 24 క్యారెట్స్ ధర రూ. 60,110వద్ద కొనసాగుతోంది. నిజామాబాద్‌లో 22 క్యారెట్స్ గోల్డ్ ధర రూ. 55,100కాగా, 24 క్యారెట్ల ధర రూ. 60,110గా ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే విజయవాడలో 22 క్యారెట్ల ధర రూ. 55,100గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ. 60,110గా ఉంది. ఇక సాగర నగరం విశాఖపట్నంలో 22 క్యారెట్స్ ధర రూ. 55,100కాగా, 24 క్యారెట్ల ధర రూ. 60,110 వద్ద కొనసాగుతోంది. ఆధ్యాత్మికత నగరం తిరుపతిలో 22 క్యారెట్ల ధర రూ. 55,100కాగా, 24 క్యారెట్స్ ధర రూ. 60,110గా ఉంది.

**దేశంలోని పలు ప్రధాన నగరాల విషయానికొస్తే..**

ఢిల్లీలో 24 క్యారెట్స్ గోల్డ్ ధర రూ. 60,460గా ఉంది. కిలో వెండి ధర రూ. 73,100, చెన్నైలో రూ. 78,500, బెంగళూరులో 73,000 వద్ద కొనసాగుతోంది. ఇక తెలంగాణ రాజధానిలో కిలో వెండి ధర రూ. 78,500కాగా, విజయవాడ, విశాఖపట్నంలో రూ. 78,500వద్ద కొనసాగుతోంది.

# బతికుండగానే కుమార్తెకు కర్మకాండలు

**కర్నూలు :**

కడుపులో బిడ్డ ఉన్నప్పటి నుంచే వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వారి భవిష్యత్తు గురించి ఎన్నెన్నో కలలు కంటారు. బాగా చదివించి ఉన్నత స్థానంలో ఉంచాలనుకుంటారు. అందరిలాగే ఆ తల్లిదండ్రులు కూడా కలలు కన్నారు. కూతురును బాగా చదివించి.. తమ స్థాయికి తగ్గ వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయాలనుకున్నారు. కానీ కూతురు ఓ అబ్బాయిని ప్రేమించింది. అదే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారికది నచ్చలేదు. వద్దని వారించారు. అయినా వినని కూతురు.. అతడితో వెళ్లిపోయి ప్రేమ పెళ్లి చేసుకుంది. దీంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. తమను కాదని ఇంట్లోంచి వెళ్లిపోయిన కూతురు.. చనిపోవడంతో సమానం అని భావించారు. ఈక్రమంలోనే ఆమె ఫొటోకు దండ వేసి కర్మకాండలు జరిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ గా మారింది. కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలంలోని హనుమాపురంలో నివాసం ఉంటున్న గొల్ల పెద్ద నాగన్న, ఉరుకుందమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. అయితే వీరి పెద్ద కుమార్తె ఇందు.. అదే మండలం వెంకటగిరికి చెందిన ఉరుకుంద అనే యువకుడిని ప్రేమిచింది. అదే విషయాన్ని ఇంట్లో కుటుంబ సభ్యులకు తెలిపింది. అయితే వారు కూతురు ప్రేమను అంగీకరించలేరు. ఎట్టి పరిస్థితుల్లోనూ అతడిని పెళ్లి చేసుకోనివ్వమంటూ పట్టు పట్టారు. దీంతో భయపడిపోయిన యువతి.. తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ప్రేమించిన యువకుడిని పెళ్లాడింది. అయితే విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఓ వైపు కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే.. మరోవైపు ఆగ్రహంతో ఊగిపోయారు. వెంటనే పెద్దకడబూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రేమికుల ఇద్దరినీ పిలిపించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా ఇందు తల్లిదండ్రుల మాట వినలేదు. ఇద్దరూ మేజర్లు కావడంతో అధికారులు వారిద్దరినీ స్టేషన్ నుంచి పంపించి వేశారు. కూతురు ఇందు తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకొని ఇంట్లోంచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేని తల్లిదండ్రులు.. తమ కూతురు ఇందు 07-06-2023న చనిపోయిందని ఓ చిత్రపటాన్ని తయారు చేయించారు. అనంతరం ఆ చిత్రపటానికి పూల మాలలు వేసి ఇ?టమైన ఆహార పదార్థాలు చిత్ర పటం ముందు ఉంచారు. కొబ్బరికాయ కొట్టి, కర్మకాండ జరిపించారు. పుట్టినప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు తమకు అన్యాయం చేసి వెళ్లిపోయిందంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ తతంగాన్ని అంతా ఎవరో వీడియో తీసి నెట్టింట పెట్టారు. ఇది కాస్తా వైరల్ గా మారింది. ఎక్కడ చూసిన ఈ వీడియో, ఫొటోలే కనిపిస్తున్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలోని చింతకుంట మండలం మద్దూరు గ్రామానికి చెందిన భార్గవి అనే యువతి అదే గ్రామానికి చెందిని వెంకటేష్ అనే యువకుడిని ప్రేమించింది. వీరు ఇద్దరూ సమీప బంధువులే. వీరి మధ్య క్రమంగా ప్రేమ చిగురించింది. పెళ్లి చేసుకోవాలని అనుకొని ఇద్దరూ వారి వారి ఇళ్లలో పెద్దలను ఈ విషయం చెప్పారు. తాము ఇద్దరం ఒకర్నొకరు ప్రేమించుకున్నామని, పెళ్లి చేయాలని కోరారు. అందుకు పెద్దలు ససేమిరా అన్నారు. ఎంత నచ్చచెప్పినా ఇంట్లో వారు ఒప్పుకోకపోవడంతో చేసేది లేక ఎవరికి తెలియకుండా పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. జనవరి 13న స్థానికంగా ఓ గుడిలో ఎవరికీ తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. వివాహ బంధంతో ఒక్కటయ్యారుఈ విషయం యువతి ఇంట్లో తెలిసి ఆగ్రహంతో ఊగిపోయాడు. ఇంట్లో వారిని కూడా కాదని ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకుందని భార్గవి తండ్రి కోపంతో రగిలిపోయాడు. ఈ క్రమంలోనే ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. తన కూతురితో తనకు ఎలాంటి సంబంధం లేదని.. ఈ పెళ్లితో ఆమె చనిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా ఆయన తన కూతురు చనిపోయిందంటూ గుండు గీయించుకుని ఆమెకు కర్మకాండలు జరిపించాడు. కూతురి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి అర్పించాడు. కూతురి ప్రేమ వివాహాన్ని భరించలేని తండ్రి చేసిన పని స్థానికంగా చర్చనీయాంశం అయింది.

# 62 ఏళ్ల వయస్సులో ముగ్గురు పిల్లలకు తండ్రి

**భోపాల్ :**

62 ఏళ్ల వయసులో ఓ వ్యక్తి ఒకేసారి ముగ్గురు పిల్లల తండ్రయ్యాడు. ఆయన రెండో భార్య ఒకే కాన్పుల్లో మంగళవారం ఉదయం ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే..సత్నా జిల్లాలో ఉచెహ్రా మండలం అతర్వేదియా ఖుర్ద్ గ్రామానికి చెందిన గోవింద్ కుష్వాహా (62) కొంతకాలం క్రితం హీరాబాయి కుష్వాహా (30)ను రెండో వివాహం చేసకున్నాడు. ఈ క్రమంలో ఆమె గర్భందాల్చగా గురువారం రాత్రి హీరాబాయికి పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో హుటాహుటీనా జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సిజేరియన్ చేసి ప్రసవం చేశారు. హీరాబాయి ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఒకేసారి ముగ్గురు పిల్లలకు తండ్రయ్యే సరికి గోవింద్ కుష్వాహా ఆనందానికి అవదులు లేవు. శిశువులు కాస్త బలహీనంగా ఉండటంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యుడు అమర్ సింగ్ తెలిపారు.గోవింద్ మాత్రం'నేను రెండు పెళ్లిళ్లు చేసుకున్నాను. నా మొదటి భార్య పేరు కస్తూరిబాయి. ప్రస్తుతం ఆమెకి 60 ఏళ్లు. మాకు కుమారుడు పుట్టాడు. ఐతే 18 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో నా మొదటి భార్య కస్తూరిబాయే దగ్గరుండి మరీ నాకు రెండో వివాహం జరిపించింది. పెళ్లయిన ఆరేళ్లకు హీరాబాయి ముగ్గురు పిల్లలకు జన్మనివ్వడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

# విద్యకు పెద్దపీట వేసింది జగనన్నే

**కావలి**

విద్యారంగానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనని శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పాతవూరు పురపాలక సంఘం ఉన్నత పాఠశాల నందు శనివారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గం లోని ఉత్తమ ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పోటీ తత్వంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ఉన్నత చదువులు చదివి



తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి నూతన అంగులతో ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులతో పాటుగా ప్రశంసా పత్రం మరియు మెడల్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ప్రిన్సిపల్, టీచర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతోనే సింహగిరి ప్రదక్షిణ విజయవంతం

## స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రశంసనీయం

## సింహాచలం ఆలయ ఈవో డి భ్రమరాంబ

**సింహాచలం**

ఆందరి సహకారంతో గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేద్దామని సింహాచలం ఆలయ ఈవో డి భ్రమరాంబ అన్నారు. శనివారం ఇక్కడ సింహాచలం దేవస్థానం పరిపాలన భవనం కార్యాలయంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఈవో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తొలుత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు గిరిప్రదక్షిణ ఏర్పాట్లును వారికి వివరించారు. గత ఏడాది ఎన్ని స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు, ఎవరు ఎక్కడ ఏటువంటి స్టాల్స్ యేర్పాటు చేశారన్న వివరాలు తెలియజేశారు. అనంతరం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ లో తాము ఈ యేడాది కూడా పూర్తిస్థాయిలో భాగస్వాములు కానున్నట్లు చెప్పారు. చోడవరం ప్రాంతానికి చెందిన ఒక సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ తాము నూతన గోశాలలో 10,000 మందికి అన్న ప్రసాదము ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మరికొన్ని సంస్థలు ప్రతినిధులు మాట్లాడుతూ పులిహార, పొంగలి. దద్దోజనం, పాలు, మందులు, పండ్లు, బిస్కెట్లు. మజ్జిగ మంచినీరు అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తామని ఈఓ కి తెలిపారు. గత ఏడాది సుమారు 70 స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం జరిగిందని ఈ యేడాది వారందరి సహకారం తీసుకుందామని ఈఓ తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులనుద్దేశించి ఆలయ ఈవో



భ్రమరాంబ మాట్లాడుతూ గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా దేవస్థానం నిర్దేశించిన ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అలాగే దేవస్థానం తరపున వసతి, మంచినీరు వంటి సదుపాయాలు సదరు సంస్థలకు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ యేడాది కొండ చుట్టూ సుమారు 27 దేవస్థానంస్టాల్స్ యేర్పాటు చేయ నున్నట్లు అలాగే కాలి నడకన సింహ గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు అన్ని సదు పాయాలు కల్పిస్తున్నట్లు ఈఓ తెలిపారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీను బాబు మాట్లాడుతూ గత ఏడాది గిరిప్రదక్షిణ ఉత్సవం పూర్తిస్థాయిలో విజయవంతం అయింది అన్నారు. ఈ ఏడాది కూడా అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు . లక్షల్లో రానున్న భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ఎవరి స్థాయిలో వారు కృషి చేయాలన్నారు.. త్వరలోనే ఏర్పాట్లు పూర్తి చేసుకుని సన్నద్ధము కావాలన్నారు.. సేవా సంస్థలకు గతము లో మాదిరి గానే దేవస్థానం తరపున ప్రశంశా పత్రాలు అందచేయాలని కోరగా ఈఓ బ్రమరాంబ సానుకూలముగా స్పందించారు..సమావేశములో ధర్మ కర్తల మండలి సభ్యులుగంట్ల శ్రీను బాబు, ఎం. రాజేశ్వరి, శ్రీదేవి వర్మ, డి. రామ లక్ష్మి, ఈఈ రాంబాబు, ఎ ఈ హరి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## బైకు, లారీ ఢీ-దంపతులు మృతి

**అనంతపురం**



అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెన్నఅ హోబిలం వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో బైకు పై వెళుతున్న అనంతపురానికి చెందిన నాగరాజు (30), శ్వేత (25) దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు పిల్లలు హేమంత్ (4), భానుశ్రీ (6) లకు గాయాలయ్యాయి.

## విహెచ్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనను కలిసిన ఆర్.ఆర్ ఆర్ భూమి బాధితులు

**హైదరాబాద్**

మాజీ ఎంపీ వి.హనుమంతరావు జన్మదినోత్సవం సందర్భంగా భువనగిరి రీజనల్.రింగ్ రోడ్డు బాధితులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఇటీవల వారిపై కేసులు పెట్టి బేడీలు వేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న వి.హెచ్ వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతానని అన్నారు. రేపు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీలో కూడా ఈ విషయాన్ని చర్చించి కాంగ్రెస్ పక్షాన పోరాటం చేస్తామని అన్నారు..

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి వనిత

**కాకినాడ**

కాకినాడ జిల్లా గండేపల్లి లో కోటి 80 లక్షల తో నాడు నేడు నిధులతో నిర్మించిన గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హోం మంత్రి తానేటి వనిత శనివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైద్య ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పేదవాడికి ఖరీదైన వైద్యం సకాలంలో ఉచితంగా అందించడమే ముఖ్యమంత్రి తపన. ప్రతి సచివాలయ పరిధిలో ఒక హెల్త్ సెంటర్ ను ఏర్పాటు చేయడం వేలకోట్లు వైద్యానికి అందించడం జగనన్న ధ్యేయం. ప్రజలంతా దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డిని ఎలా అభినందించారు జగనన్నను కూడా అదే విధంగా ఆదరిస్తున్నారని అన్నారు.

## జక్కంపూడి విగ్రహం ధ్వంసం

**సీతానగరం**

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఇనుగంటివారి పేటలో జక్కంపూడి రామ్మోహన్ రావు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. విషయం తెలుసుకొని వైసీపీ ఉభయగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ విగ్రహం ధ్వంసం చేసిన ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అయన అన్నారు.

## వైకాపా కౌన్సిలర్ల ఘర్షణ

**అమలాపురం**

అమలాపురం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ వద్ద వైసీపీలోని రెండు వర్గాల కౌన్సిలర్ల మధ్య వివాదం చెలరేగింది. దాంతో పరస్పరం కొట్టుకున్నారు. తరువాత రెండు వర్గాల వైసిపి నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## రోడ్డు ప్రమాదంలో రేషన్ బియ్యం పట్టివేత

**రాజానగరం**

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం హైస్కూల్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. అకి అయిల్ ట్యాంకర్ ముందు వెళుతున్న లాఈరీలని వెనుక నుండి ఢీకొట్టింది. జాతీయ రహదారి నుండి కాకినాడ ఎడిబి రోడ్ కు తిరుగుతుండగా ఘటన జరిగింది. వెంటనే లారీ డ్రైవర్ ఘటనా స్థలం నుండి పరారైయాడు. స్థానికుల సమాచారం తో రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు లారీ దగ్గరకు చేరుకున్నారు. లారీలో బియ్యం ఉండడంతో ,ఇవి రేషన్ బియ్యంగా అనుమానంతో రాజానగరం పీఎస్ కు తరలించారు.

## కైలాసగిరి టాయ్ ట్రైన్ ప్రారంభం

**విశాఖపట్నం**

విశాఖ కైలాసగిరి అందా లను చుట్టేసే పర్యాటకుల పుష్పక విమానం అందుబాటులోకి వచ్చేసింది. పచ్చని ప్రకృతి అందాల మధ్య విహ రించి మధురానుభూతిని అందించే టాయ్ ట్రైన్ సేవలను పర్యాటకులను పలకరించాయి.కైలాసగిరిపై విశాఖ దర్శన్ పేరుతో సర్క్యులర్ టాయ్ ట్రైన్ను కలెక్టర్ మల్లికార్జున, వీఎంఆ ర్డీయే చైర్పర్సన్ అక్కరమాని విజయ నిర్మలతో పునఃప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంతకాలంగా నిలిపివేసిన ట్రైన్ను వీఎంఆర్డీయే ఆధ్వర్యంలో తిరిగి అన్ని సౌకర్యాలతో సందర్శకులకు అందుబాబులోకి తీసుకువచ్చామ న్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ రైలు నడు స్తుం దన్నారు. పర్యాటకులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తెన్నేటి పార్కు ఆవరణాన్ని కలెక్టర్ పరిశీలించారు. పార్కులో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు.గత కొద్దికాలంగా ఈ రైలు సేవలు నిలిచిపో యాయి.వీఎంఆర్డీఏ చొరవ తీసుకు ని సొంతంగానే ఈ రైలును నడిపేం దుకు నిర్ణయించడంలో ఎట్టకేలకు ఈ ట్రైన్ సేవలు అందుబాటులోకి వచ్చా యి.దీంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అపచారం వల్లే అగ్ని ప్రమాదాలా...

**తిరుపతి :**

తిరుపతి నగరంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కోట్ల రూపాయల్లో ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం గోవిందరాజస్వామి ఆలయం సమీపంలోని లావణ్య ఫొటో ఫ్రేమ్ వర్క్స్ షాపులో మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు ఉవ్వెత్తున వ్యాపించి.. ఇళ్ల దిశగా వచ్చాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దూరంగా పరుగెత్తారు. గోవింద రాజస్వామి ఆలయ రథానికి సమీపం వరకూ మంటలు వ్యాపించాయి. స్థానికులు కొంత మంది కలిసి రథాన్ని దూరంగా లాగడంతో ప్రమాదం తప్పింది. ఈలోగా అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పి వేశారు. 2 గంటలకు పైగా శ్రమించి మొత్తం 10 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గోవిందరాజస్వామి ఆలయం పక్కన ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో ఫోటో ఫ్రేమ్ వర్క్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో భవనం ముందు ఉన్న 5 బైక్‌లు దగ్ధమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు .తిరుపతిలో అపచారం జరగడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక టీడీపీ నేతలు ఆరోపించారు. ఘాట్ రోడ్డులో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాదాల గురించి పరోక్షంగా ప్రస్తావించారు. తిరుమలలో జరుగుతున్న అపచారాలు, అన్యమత ప్రచారం లాంటి అపశ్రుతుల వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని టీడీపీ నాయకురాలు సుగుణమ్మ ఆరోపించారు. గోవిందరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు పడిపోతే.. ఆలయాన్ని సంప్రోక్షణ చేశారా అని ఆమె ప్రశ్నించారు. తిరుమల కొండపైకి అన్యమత ప్రచారానికి సంబంధించిన స్టిక్కర్ ఉన్న వాహనం ఎలా వెళ్లిందని ఆమె ప్రశ్నించారు.గంగమ్మ జాతరలోనూ అపచారం జరిగిందని, తిరుపతిలో అపచారాల వల్లే తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని సుగుణమ్మ అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం బ్రాహ్మణులతో అన్నీ చెప్పించుకొని, తిరుపతి నగరం మొత్తం శాంతి ప్రవచనాలు పలికించాలని ఆమె కోరారు.ఈ అగ్నిప్రమాదాన్ని టీడీపీ నేతలు రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై సమగ్ర విచారణ చేయిస్తున్నామని ఆయన తెలిపారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, అధికారులతో కలిసి ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో గోవింద రాజస్వామి వారి రథానికి మంటలు? అంటుకున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని ఆయన హితవు పలికారు.

# సేవా కార్యక్రమాలపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్

**గుంటూరు:**

టీడీపీ నేత నారా లోకేష్ ప్రస్తుతం రాజకీయాల్లో యాక్టీవ్ గా ఉంటున్నారు. ఓ వైపు పాదయాత్రలో పాల్గొంటూనే మరోవైపు మంగళగిరి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఆయన పాదయాత్రలో ఉన్నా కూడా తెలుగుదేశం సైనికులు, తెలుగు యువత ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది మంగళగిరి తెలుగుదేశం పార్టీ. ఇటీవలే ఆయన పాదయాత్రను పూర్తి చేసుకున్నారు. అయితే మంగళగిరిలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను ప్రపంచానికి పరిచయం చేసే విధంగా మంగళగిరి తెలుగుదేశం పార్టీ ఓ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. మంగళగిరిలో జరుగుతోన్న సేవా కార్యక్రమాలపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ ను నిర్వహించనుంది. ఆ కాంటెస్ట్ కు సంబంధిచిన వివరాలను ఓ ప్రకటనలో తెలిపింది పార్టీ. టీడీపీ నేత నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో విస్తృతంగా జరుగుతున్న సేవా కార్యక్రమాలపై ఓ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ ను నిర్వహించనుంది పార్టీ. ఈ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ కు సంబంధించిన వివరాలను ఇటీవలే ప్రకటించింది పార్టీ. ఈ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ లో పాల్గొనాలనుకునే వారు వారి ఎంట్రీలను జూన్ 13 నుంచి 30 వ తేదీలోపు మంగళగిరిలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఉచితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తీయబోయే షార్ట్ ఫిల్మ్ ను కంప్లీట్ చేసుకొని ఆ లింక్ లను ఆగష్టు 13 వ తేదీలోపు టీడీపీ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్ నిడివి 5 నిమిషాల కన్నా ఎక్కవ ఉండకూడదని తెలిపారు. షార్ట్ ఫిల్మ్ థీమ్ కి కావాల్సిన అన్ని వివరాలు రిజిస్ట్రేషన్ సమయంలో టీడీపీ కార్యాలయంలో అందిస్తారని వెల్లడించారు.ఈ షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ లో గెలిచిన వారికి మొదటి బహుమతిగా లక్ష రూపాయలు, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.30 వేలు ఇవ్వనున్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి తగిన అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. అంతే కాకుండా సోషల్ మీడియా వేదికలపై ఎక్కువ వ్యూస్ వచ్చిన మొదటి మూడు షార్ట్ ఫిల్మ్ లకు రూ.50, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. ఇవి కాకుండా ఓ మూడు షార్ట్ ఫిల్మ్ లను ఎంపిక చేసి కన్సోలేషన్ బహుమతి కింద రూ.10 వేలు అందజేస్తామని తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే నారా లోకేష్ రాయకీయంగా చాలా యాక్టీవ్ అయినట్టే కనిపిస్తున్నారు. 2014 ఎన్నికల తర్వాత ఆయన మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్నా నేరుగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి రాలేదు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళగిరిలో పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓడిపోయినా మంగళగిరిను మాత్రం వదల్లేదు. ఓ వైపు రాష్ట్ర వ్యాప్త పర్యటనలు చేస్తూనే మరోవైపు మంగళగిరిలో సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలో ఉన్న చిన్న చిన్న సమస్యలు, రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలు, అన్నా క్యాంటీన్లు, ఆరోగ్య సంజీవని రథాలు, స్త్రీ శక్తి కార్యక్రమం, చేనేతలకు సాయం, తోపుడు బండ్లు, ట్రై సైకిల్స్ ఇలా ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో చేస్తున్నారు. ఏదేమైనా ఈసారి మంగళగిరిలో గెలుపే లక్ష్యంగా నారా లోకేష్ ముందుకు దూసుకెళ్తున్నారు.

## చేతివృత్తుల రుణాలను స్వర్ణకారులు సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి**

చేతివృత్తుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే రాయితీతో కూడిన రుణాలను స్వర్ణకారులందరు సద్వినియోగపరచుకోవాలని ఎం ఎస్ ఎం ఈ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ అన్నారు. ఎం ఎస్ ఎం ఈ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని వివిధ బ్యాంక్ అధికారులతో స్వర్ణకారులతో స్థానిక సిరి ఫంక్షన్ హాల్లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరతరాలుగా కులవృత్తులను నమ్ముకున్న



చేతివృత్తులదారులను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సబ్సిడీ రుణాలను అందిస్తున్నారని, అందులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే సబ్సిడీ రుణాలను అందించడానికి తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ మేనేజర్ మధుసూదనాచారి, బి ఐ ఎస్ హాల్ మార్క్ ప్రతినిధులు ప్రశాంతి, తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణచారి, పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగు శ్రీనివాస్, శ్రీరామోజు రాజు, నాయకులు బసవపాత్రుని వెంకట నరసయ్య, కనపర్తి భాస్కరాచారి, విజయగిరి శ్రీనివాస్, కట్ట సదానందం, కందుకూరి ప్రకాష్ రావు, కొండపర్తి నరహరి కట్ట శ్రీధరాచారి, గాలిపెల్లి రమేష్, అధికారులు సంఖ్యలో స్వర్ణకారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మరో 8 మెడికల్ కాలేజీలు

**హైదరాబాద్ :**

తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచే మరో 8 ప్రభుత్వ వైద్య కళాశాలలను కొత్తగా ప్రారంభించడానికి ప్రతిపాదనలను రూపొందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు రాష్ట్రంలో వచ్చే ఏడాదికి అన్ని జిల్లాల్లో ఒక్కో ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్నది సీఎం కేసీఆర్ లక్ష్యమని గుర్తుచేశారు.సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు జిల్లా స్థాయిలోనే స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతోనే ప్రతి జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను స్థాపిస్తున్నామన్నారు. ఇప్పటికే 33 జిల్లాలకు 25 జిల్లాల్లో ఏర్పాటు చేశామని, మిగిలిన ఎనిమిది జిల్లాల్లోనూ ప్రారంభించేందుకు అవసరమైన భూకేటాయింపులు, ఇతర పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశిం చారు. జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఇబ్బంది కలగకుండా జాతీయ వైద్యమండలి మార్గదర్శకాల ప్రకారం మెడికల్ కాలేజీల ఏర్పాటు ప్రక్రియను పూర్తిచేయాల్సిందిగా అధికారులకు మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఇప్పటికే ప్రారంభించిన వైద్య కళాశాలలు ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం నడుచుకునేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపరింటెండెంట్ లపైనే ఉందన్నారు. రాష్ట్రంలో పెద్ద మొత్తంలో మౌలిక వసతుల కల్పనతోపాటు వైద్య సిబ్బందిని నియమిస్తూ ఆరోగ్యరంగాన్ని పటిష్ఠం చేసినట్లు మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఈ చర్యలతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల తెలంగాణ వైద్యరంగంలోని వివిధ విభాగాల్లో చాలా ముందుందని. అన్ని రంగాల్లో కలిపి రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పమని మంత్రి వెల్లడించారు. ఈమేరకు ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని హరీశ్‌రావు కోరారు.

## బాధితురాలిని పరామర్శించిన జపసేన నేతలు

**మదనలపల్లె**

వైసిపి అరాచకాలకు చరమ గీతం పాడే సమయం దగ్గర పడిందని జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామదాసు చౌదరి హెచ్చరించారు. నేడు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైసిపి నాయకుల దాడికి గురై మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వేంపల్లి హరిజనవాడకు చెందిన స్వాతిని జనసేన నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జంగాల శివరాం ఉన్నారు. ఈ సందర్భంగా గంగారపు రామదాసు చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు సామాన్యుల పై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బాధితురాలు స్వాతి పోలీసుకు ఫిర్యాదు చేస్తే స్పందించక పోవడం బాధాకరమన్నారు. వారికి న్యాయం చేయాలని లేనిపక్షంలో వారికి అండగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## మదనపల్లెలో విద్యార్థులకు కానుకలు

**మదనపల్లె**

విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే నవాజ్ భాషా కొనియాడారు.అన్నమయ్య జిల్లా మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల నందు జగనన్న ఆణిముత్యం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో అధిక మార్కులు వచ్చిన పదవ తరగతి చెందిన ముగ్గురు విద్యార్థులకు, ఇంటర్మీడియట్ కు చెందిన ముగ్గురు వ్యక్తులకు ఎమ్మెల్యే నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ంఖఓఆఅ చైర్మన్ షమీంఅస్లాం, మున్సిపల్ ఛైర్ పర్సన్ వరపన మనూజ, ఎంపిపి రెడ్డమ్మ, వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్అజామ్, ప్రజాప్రతినిధులు వైకాపా నేతలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు.

## కుట్రపూరతంగానే ఐటీ రైడ్స్

**భువనగిరి**

గత మూడు రోజులుగా నాపై కుట్ర పూరితంగా నే ఐటీ రైడ్స్ జరుగుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆరోపించారు. నాపై జరుగుతున్న పలు ఆరోపణలు నిజం కాదు. ఐటీ రైడ్స్ మొదటి రోజే ఒక గంటన్నర లోనే పూర్తి అయ్యాయి. కావాలనే 3 రోజులు కాలయాపన చేశారు. నేను చేస్తున్న విదేశాలలో మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయి అన్నది ఆ వాస్తవం. ఐటీ అధికారులకు నేను పూర్తిగా సహకరించాను. నాపై కక్ష్య సాధింపు చర్యలలో భాగంగా ఈ ఐటీ దాడులు జరిగాయని అన్నారు.

1998 నుండి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాను.. నాకు ఎలాంటి మైనింగ్ వ్యాపారాలు లేవు. ఐటీ అధికారులకు వారికి అనుకూలమైన సమాచారం రాకపోవడంతో వారంతా నిరుత్సాహం తో వెనుదిరిగారు. విచారణలో భాగంగా ఎప్పుడు పిలిచినా వెళ్ళడానికి సిద్ధం. నాకోసం మూడు రోజులుగా ఉన్న కార్యకర్తలకు, నాయకులకు అందరికి ధన్యవాదాలని అన్నారు.

## మండలి బుద్ధ ప్రసాద్ అరెస్టు

**అవనిగడ్డ**

కృష్ణా జిల్లా అవనిగడ్డలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.మట్టి మాఫియాని అరికట్టాలంటూ నాగాయలంక తహశీల్దార్ కార్యాలయం ముట్టడికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పిలుపిచ్చారు.ఈ సందర్భంగా నాగాయలంకకు బయలుదేరిన బుద్ధ ప్రసాద్ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులు.. తెలుగుదేశం శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.బుద్ధ ప్రసాద్ను ఎక్కించిన జీపు ముందు టీడీపీ కార్యకర్తలు బేటాయిం చి నిరసన తెలిపారు. దీంతో పోలీసు లు కార్యకర్తలను పక్కకు లాగివేసి.. బుద్ధ ప్రసాద్ను కోడూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు

## తెలంగాణకు రూ.1.78 లక్షల కోట్ల నిధులు

**హైదరాబాద్**

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 దాకా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే కేవలం 32 శాతం మాత్రమే ఉండేదని చెప్పారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 32 శాతం ఉన్న రాష్ట్ర పన్నుల వాటాలను 42 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు కేంద్రం ప్రభుత్వం.. తెలంగాణకు దాదాపు రూ.1.78 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందని చెప్పారు.అలాగే హైదరాబాద్‌లోని రిజినల్ రింగ్ రోడ్డు కోసం రూ.21,201 కోట్లు కేటాయించిందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.715 కోట్లు ఇచ్చిందని పేర్కొన్నారు. చర్లపల్లి టెర్మినల్ కోసం రూ.221 కోట్లు, ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ కోసం రూ.1,153 కోట్లు కేటాయించిందని వివరించారు.

## జాషూవాకు సన్మానం

**చిత్తూరు**

మైనారిటీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా జాషువా ను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చిత్తూరు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు జాషువా ను కప్పి గజమానువేసి ఘనంగా సత్కరించారు.

# టీటీడీ ఘాట్ రోడ్డులో మహాశాంతి హోమం

**తిరుమల :**

తిరుమల ఘాట్ రోడ్డులో వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో టీటీడీ ఘాట్ రోడ్డులో మహాశాంతి హోమం నిర్వహించింది. వెంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి అనుగ్రహం కోరుతూ ఏడో మైలు దగ్గర హోమం చేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సుల వల్లే రోడ్డు ప్రమాదాల్లో భక్తులకు పెద్ద గాయాలు కాలేదన్నారు టీటీడీ ఈవో ధర్మారెడ్డి. ఈ హోమం ద్వారా ఎలాంటి ఆపదలు కలుగకుండా నివారణ చేయొచ్చు అన్నారుతిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు టీటీడీ మహాశాంతి హోమం జరిపించింది. అయితే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఎవరూ చనిపోలేదు కానీ.. వాహనాలు పాడైపోయాయి. అంతేకాకుండా భక్తులు గాయాల పాలయ్యారు. అయితే ఆ వెంకటేశ్వర స్వామి చల్లని చూపు వల్లనే భక్తులకు ఎలాంటి ఆపద జరగడం లేదని తెలిపారు టీటీడీ ఈవో ధర్మారెడ్డి. అయితే ఈ హోమం ద్వారా ఎలాంటి ప్రమాదాలు, ఆపదలు కలుగుకుండా నివారణ చేయొచ్చని.. అందుకే మహాశాంతి హోమం జరిపించినట్లు ఈవో తెలిపారు. డౌన్ ఘాట్ రోడ్డులోని ఏడో మైలు శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహం దగ్గర మహా శాంతి హోమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో పాల్గొన్నారు. ఘాట్ రోడ్లలో వరుస ప్రమాదాల్లో ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో పాటుగా.. మరికొన్ని ప్రమాదాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఘటనల అనంతరం ఘాట్ రోడ్డు ప్రమాదాలను ఎలా అధిగమించాలనే అంశంపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్టీసీ ఆర్ఎంలతో సమావేశం నిర్వహించినట్లు ఈవో చెప్పారు. అదే సమయంలో, భక్తుల భద్రత కోసం శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామివారి అనుగ్రహం కోరుతూ హోమం నిర్వహించాలని టీటీడీ ఆగమ సలహాదారులు సూచించారన్నారు. అందుకోసమని ఘాట్ రోడ్లలో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా ఉండేందుకు.. మహా శాంతి హోమం నిర్వహించిన్నట్లు ఈవో తెలిపారు. ఆపదలు, భయాందోళనలు, అంటువ్యాధులు మొదలైన అశుభాలు కలిగినప్పుడు మహాశాంతి హోమం నిర్వహించాలని ఆగమ సలహాదారు శ్రీ మోహన రంగాచార్యులు, తిరుమల ఆలయ ప్రధాన అర్చకులలో ఒకరైన శ్రీ వేణుగోపాల దీక్షితులు తెలిపారు. ఈ హోమం నిర్వహించడం ద్వారా ఎటువంటి ఆపదలు కలుగకుండా నివారణ చేయవచ్చని వారు వివరించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ట, విశేష హోమాలతో మహా శాంతి హోమం ప్రారంభమై మహా పూర్ణాహుతితో ముగిసింది.

# ఇక కరెంట్ కు స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు

**చెన్నై :**

దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాయి. ఈక్రమంలోనే వినియోగదారులు విద్యుత్ వాడకం, తమ ఖాతాలో ఉన్న బ్యాలెన్స్ ను రోజువారీగా మొబైల్ ఫోన్లలో చెక్ చేసుకునే వీలును కల్పించేందుకు కేంద్ర విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారుల హక్కులను సవరిస్తూ.. గురువారం కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం డిస్కంలు అన్ని రకాల స్మార్ట్ మీటర్లను ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా రిమోట్ విధానంలో పరిశీలించాలి. స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్ వినియోగదారులకు వారి విద్యుత వాడకానికి సంబంధించిన సమాచారాన్ని వెబ్ సైట్ లేదా మొబైల్ యాప్ లేదా ఎస్ఎంఎస్ ల ద్వారా అందుబాటులో ఉంచాలి. ఎప్పటికప్పుడు వారు తాము వాడిన యూనిట్లు, దానికి అయిన ఖర్చు, మిగిలిన నగదు నిల్వను తనిఖీ చేసుకోవడానికి వీలు కల్పించాలని విద్యుత్తు శాఖ పేర్కొంది.స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్తు వాడకం గరిష్ట స్థాయిలో రికార్డు అయితే దాన్ని అంతకుముందు కాలానికి వర్తింపజేసి జరిమానా విధించకూడదు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసేటప్పుడు ఇచ్చిన పరిమితికి మించి గరిష్ఠ స్థాయిలో ఒక నెలలో విద్యుత్తు వాడకం నమోదు అయితే ఆ బిల్లింగ్ కాలం వరకు బిల్లును వాస్తవంగా నమోదైన గరిష్ఠ డిమాండ్ ఆధారంగా లెక్కించాలి. ఆ లెక్కింపులో వచ్చిన మార్పును వినియోగదారుడికి ఎస్ఎంఎస్ లేదా మైబైల్ యాప్ ద్వారా తెలిసేలా చేయాలి. వినియోగదారులకు మీటర్ కేటాయిం చే సమయంలో దాని సామర్థ్యాన్ని నిర్ధారిస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు వినియోగం.. దానికి మించి నమోదు అయితే అందులోని కనిష్ఠ రికార్డు మొత్తాన్ని పరిగణలోకి తీసుకొని మీటర్ లోడ్ ను సవరించాలి. తదుపరి ఆర్థిక సంవత్సరం నుంచి ఆ ప్రకారం బిల్లింగ్ సైకిల్ అమలు చేయాలి. విద్యుత్ వినియోగాన్ని సమతౌల్యం చేయడానికి వాడుక సమ యాన్ని పీక్ అవర్స్, టైమ్ ఆఫ్ డే గా విభజిస్తారు. టైమ్ ఆఫ్ డేలో వినియోగం తక్కువ ఉంటుంది కాబట్టి ఆ సమయంలో వాడే విద్యుత్తుకు తక్కువ రుసుం వసూలు చేయాలని కేంద్రం పేర్కొంది. ఎలాంటి వినియోగదారులకు ఎప్పటి నుంచి ఈ నిబంధనను వర్తింపజేయాలో ఇందులో పూర్తిగా వివరించింది. పది కిలో వాట్లకు మించి డిమాండ్ ఉన్న వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులకు 2024 ఏప్రిల్ ఒకటవ తేదీ లోపు టైమ్ ఆఫ్ డే టారిఫ్ అమలు చేయాలని స్పష్టం చేసింది. వ్యవసాయ దారులు మినహా ఇతర వినియోగదారుల అందరికీ ఈ నిబంధనను 2025 ఏప్రిల్ 1వ తేదీలోపు వర్తింపజేయాలని పేర్కొంది. స్మార్ట్ మీర్ వినియోగదారులకు అయితే ఈ టారిఫ్ ను మీటర్ ఏర్పాటు చేసిన తక్షణం అమలు చేయాలి. టైమ్ ఆఫ్ దేగా ప్రకటించిన సమయంలో వాణిజ్య వినియోగదారులు వాడే విద్యుత్తుకు వసూలు చేసే ఛార్జీలు సాధారణ రుసుంలో 20 శాతం మించి తగ్గకూడదని వెల్లడించింది. సాధారణ వినియోగదారుల నుంచి వసూలు చేసే ఛార్జీ 10 శాతానికి మంచి తగ్గకూడదని వివరించింది. పగటిపూట సౌర విద్యుత్తు సరఫరా చేసే 8 గంటల సమయంలో వాడే విద్యుత్తుకు వసూలు చేసే ఛార్జి సాధారణ టారిఫ్ కంటే కనీసం 20 శాతం తక్కువ ఉండాలి.

# 19 తర్వాత తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్ :**

తెలంగాణలోకి నైరుతి రుతుపవనాల రాకలో జాప్యం జరుగుతోంది. ఏపీలోనే నైరుతి రుతుపవనాలు స్తంభించి పోయాయి. గత నాలుగు రోజులుగా అసలు ముందుకు కదలడం లేదు. అరేబియా మహా సముద్రంలో ఏర్పడిన బిపోర్ జాయ్ తీవ్ర పెను తుఫాన్ కారణంగా నైరుతి రుతుపవనాలు బలహీనపడిపోయి ఏపీలోనే ఆగిపోయాయి. దీంతో తెలంగాణను ఆలస్యంగా తాకనున్నాయి. నెల 19 నాటికి తెలంగాణను నైరుతి రుతుపవనాలు తాకే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారిణి శ్రావణి తాజాగా స్పష్టం చేశారు. 19వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశిస్తే అవకాశముందని అంచనా వేశారు. ఆ రోజున చేరుకుంటే.. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి వారం రోజుల సమయం పడుతుందని చెప్పారు. నైరుతి రుతుపవనాలు తాకగానే వెంటనే వర్షాలు పడవని, తొలకరి మొదలవ్వడానికి కొద్దిరోజుల సమయం పడుతుందని వాతావరణశాఖ చెబుతోంది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 10వ తేదీ నాటికి రాష్ట్రంలోకి ప్రతి ఏడాది రాష్ట్రంలోకి చేరుకుంటాయి. కానీ జూన్ రెండోవారం ముగిసినా ఇంకా రాష్ట్రానికి రాలేదు. రుతుపవనాల ఆలస్యం వల్ల తెలంగాణలో ఎండలు, వడగాలుల తీవ్రత మరింత పెరుగుతోంది. ప్రతి ఏడాది జూన్ తొలివారం తర్వాత ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి.కానీ రుతుపవనాల జాప్యం వల్ల గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ ప్రభావంతో పాటు వడగాలుల వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లాలంటేనే చాలామంది వెనకడుగు వేస్తున్నారు. దాదాపు చాలా ప్రాంతాల్లో 44 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు చేరుకుంటున్నాయి. నైరుతి వచ్చేంతవరకు ఇలాగే వాతావరణ పరిస్థితులు ఉండనున్నాయి. నైరుతి ప్రవేశించాక ఉష్ణోగ్రతలు తగ్గనున్నాయని వాతావరణశాఖ తెలిపింది. ఇక తెలంగాణలో రానున్న రెండ్రోజుల పాటు కూడా భానుడి ప్రతాపంతో పాటు వడగాల్పులు వీయనున్నాయి. నేడు కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇక సూర్యాపేట, నల్లగొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కరీంనగర్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ వడగాలులు వీస్తాయని పేర్కొంది. రేపు కూడా ఈ జిల్లాల్లోనే వడగాల్పుల తీవ్రత ఉండనుంది. రాష్ట్రంలో నేడు, రేపు పొడి వాతావరణం ఉంటుందని, వర్షసూచన లేదని వాతావరణశాఖ అధికారులు చెప్పారు. 19వ తేదీ తర్వాత రాష్ట్రంలో వర్షాలు పడతాయని అంచనా వేశారు. అప్పటివరకు ఎండ వేడిని భరించాల్సి ఉంటుందన్నారు. కాగా ఈ సారి నైరుతి రుతుపవనాల వల్ల సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఇప్పటికే అధికారులు తెలిపారు.

# తెరపైకి మళ్లీ రెండో రాజధాని

**హైదరాబాద్ :**

బీజేపీ సీనియర్ నేత మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు భారత్ కు రెండవ రాజధానిగా హైదరాబాద్ అయ్యే అవకాశం ఉంది అంటూ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలో ఈ అంశం ఉందని తెలిపారు. గతంలో కూడా విద్యాసాగర్ రావు ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహా అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రకాష్ అంబేద్కర్ కూడా .. తెలంగాణ ప్రభుత్వ పెద్దల సమక్షంలోనే హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ కన్న కలలను నిజం చేయాలని అన్నారు. ఇందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రెండో రాజధాని కోసం కేంద్రాన్ని డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోణంలో హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలని అంబేద్కర్ బలంగా కోరేవారన్నారు. కేసీఆర్ సమక్షంలో చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు బీఆర్ఎస్ స్ట్రాటజీలో భాగం అవుతాయా అన్న చర్చ అప్పుడే ప్రారంభమయింది. ఇప్పుడు బీజేపీ కీలక నేత ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీలో నెలకొన్న కాలుష్యపరిస్థితులను చూస్తుంటే డా. బీఆర్ అంబేద్కర్ కోరుకున్నట్లుగా హైదరాబాద్ దేశానికి రెండో రాజధాని అవుతుందేమోనని అని అన్నారు. మహారాష్ట్ర గవర్నర్ గా చేసిన తర్వాత విద్యాసాగర్ రావు కొంతకాలంగా సైలెంట్ గా ఉంటున్నారు. వాజ్ పేయి హయాంలో కేంద్ర మంత్రిగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపే అవకాశాలు ఉన్నాయి.సీఎం కేసీఆర్ సమక్షంలోనే హైదరాబాద్ రెండో రాజధాని అంశాన్ని ప్రస్తావించిన ప్రకాష్ అంబేద్కర్ దక్షిణాదిన రెండో రాజధాని ఉండాలన్న ప్రస్తావన చాలా రోజులుగా వస్తున్నదే. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్వాతంత్రోద్యమ కాలంలోనే ఈ మాట చెప్పారన్న ప్రచారం ఉంది. హైదరాబాద్ ను సెకెండ్ కేపిటల్ చేయాలంటూ థాట్స్ ఆన్ లింగ్విస్టిక్ స్టేట్స్ అనే పుస్తకం 11వ అధ్యాయంలో అంబేద్కర్ రాశారు. ఈ పుస్తకం 1955లో ప్రచురితమైనప్పుడు జనం అంబేద్కర్ వాదనతో ఏకీభవించారు అయితే అది కార్యరూపానికి నోచుకోలేదు. తర్వాత మరుగున పడిపోయింది. ఇటీవలి కాలంలో మారిపోతున్న రాజకీయ ప్రాధాన్య లతో ఉత్తర దక్షిణ తారతమ్యాలను పోగొట్టేందుకు సెకెండ్ కేపిటల్ ఒకటి కావాలన్న అభిప్రాయం చాలా రోజులుగా ఉంది. ప్రకాష్ అంబేద్కర్ వ్యాఖ్యలతో మరింత విస్తృతంగా చర్చ ప్రారంభమయింది. దక్షిణాదిన సౌతిండియాలో ఒక కేపిటల్ ఏర్పాటు చేయాలన ప్రస్తావన వచ్చినప్పుడు రెండు మూడు నగరాల పేర్లు తెరపైకి వచ్చాయి. హైదరాబాద్ తో పాటు బెంగళూరు చెన్నై మహానగరాల పేర్లు కూడా వినిపించాయి. అయితే వాతావరణ సమతౌల్యత విషయంలో అందరూ హైదరాబాద్ కే మొగ్గు కనిపించింది. ల్యాండ్ లాక్డ్ ప్రదేశమైన హైదరాబాద్ కు సెక్యూరిటీ రిస్క్ లేదు. ఏ నగరంతో పోల్చుకున్నా భద్రతలో హైదరాబాద్ కు సాటి లేదు. ప్రకాశ్ అంబేద్కర్ చెప్పినట్లుగా ఢిల్లీ మన దేశ సరిహద్దుకు కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉంది. పాకిస్తాన్ దండయాత్రకు చాలా దగ్గరగా ఉంటుందని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు. హస్తినాపురి నగరం రోజు రోజుకు కాలుష్య కాసారంగా మారిపోతోంది. చలికాలం వచ్చిందంటే చాలు పొల్యూషన్ తో జనం రోగాల బారిన పడుతున్నారు. కాలుష్యం ప్రజలినప్పుడల్లా కేపిటల్ మార్పుపై చర్చ జరుగుతోంది .విద్యాసాగర్ రావు, ప్రకాష్ అంబేద్కర్ చెప్పినట్లుగా.. హైదరాబాద్ దేశ రెండో రాజధానిపై చర్చ ప్రారంభమయినట్లే. ఇది ఏ దిసగా ముందుకు వెళ్తుందనేది వేచి చూడాల్సి ఉంది.

# అప్సర కేసులో విస్తుపోయే నిజాలు

**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిన సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో సినిమాను మించిన ట్విస్టులు వెలుగులోకి వస్తున్నాయి. అయితే.. పూజారి సాయికృష్ణకు పోలీసుల కస్టడీ ముగియనుం డటంతో.. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. కాగా... ఈ సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిసాయి. పూజారి సాయికృష్ణ.. తన ప్రియురాలు అప్సరను శంషాబాద్‌లో చంపి.. తన కారులో తీసుకొచ్చి మ్యాన్ హోల్‌లో పూడ్చేశాడు. ఈ కేసులో సాయికృష్ణను పోలీసులు గురువారం రోజు కస్టడీలోకి తీసుకున్నారు. కాగా.. సాయికృష్ణ కస్టడీ శనివారం ముగియనుం డటంతో.. ఈరోజు శంషాబాద్ మండలం సుల్తాన్‌పూర్ వద్ద అప్సరను హత్య చేసిన ప్రదేశానికి, అక్కడి నుంచి పాతిపెట్టిన స్థలానికి సాయికృష్ణను తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్ట్ చేశారు. ఆ స్థలాల్లో పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్టు సమాచారంనిందితుడు సాయికృష్ణ అప్సరను హత్య చేయడానికి 15 రోజుల ముందే పక్కాగా ప్లాన్ వేసుకున్నాడు. హత్య ఎలా చేయాలి..? శవాన్ని ఎక్కడ పూడ్చేయాలి..? సాక్ష్యాధారాలు దొరకకుండా ఏం చేయాలి..? లాంటి విషయాలపై పక్షం రోజుల ముందే పక్కాగా ఓ ప్లాన్ సిద్ధం చేసుకున్నాడు. సాయికృష్ణ పూజారిగా చేస్తున్న బంగారు మైసమ్మ గుడి వెనక ఉన్న ఆసుపత్రి వద్ద ఏకంగా 20 అడుగుల గుంత తీయించాడు. అయితే.. అది గమనించిన ఆసుపత్రి సిబ్బంది సాయికృష్ణను వారించడంతో.. వెంటనే గుంతను పూడ్చివేయించాడు.అనంతరం.. ప్లాన్‌లో కొన్ని మార్పులు చేసి.. అనుకున్న విధంగానే అప్సరను ట్రాప్ చేసి హత్య చేశాడు. ప్లాన్‌లో చేసిన ఛేంజ్ ప్రకారం.. డ్రైనేజీ మ్యాన్ హోల్ వద్ద స్థలం ఉండటంతో.. అక్కడే అప్సర మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. అనంతరం.. ఎవ్వరికీ డౌట్ రాకుండా.. సాక్ష్యాలు దొరకుండా ఉండేందుకు.. మ్యాన్‌హోల్ వద్ద రెండు లోడ్‌ల మట్టి పోయించాడు. అక్కడితో ఆగకుండా దానిపై కాంక్రీట్ వేసి పూర్తిగా మూయించేశాడు. నిందితుడు సాయికృష్ణ టిప్పర్ ద్వారా మ్యాన్ హోల్‌పై మట్టి పోయించగా.. ఆ టిప్పర్ యజమానిని, కూలీని పిలిచి పోలీసులు వారి నుంచి స్పాట్‌లో స్టేట్ మెంట్ రికార్డ్ చేశారు.పూజారి సాయికృష్ణ చేసిన ఈ హత్య కేసులో బయటపడుతున్న ఒక్కో ట్విస్ట్.. క్రైమ్ మూవీని మించి ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలను పేర్కొన్నారు. అవే కాకుండా వాళ్ల కుటుంబాలు కూడా ఎవ్వరికీ తెలియని నిజాలను బయటపెడుతూ ఎప్పటికప్పుడు ఆశ్చరపరుస్తూనే ఉన్నారు. ఇంకా.. ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే సమయానికి ఈ కేసులో ఇంకెన్ని ట్విస్టులు బయటికి వస్తాయోనని పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు

# మంథని పట్టణ ప్రజలకు ఉపాధి హామీపథకాన్ని దూరం చేసింది మీరు కాదా

**మరోసారి దుద్దిల్ల కుటుంబాన్ని**

**విమర్శిస్తే ఊరుకునేది లేదు**

**కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరిక**

**మంథని**




మంథని పట్టణ ప్రజలకు ఉపాధి హామీ పథకాన్ని దూరం చేసింది మీరు కాదా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు జడ్పీ చైర్మన్ పుట్ట మధు ను ప్రశ్నించారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శుక్రవారం మాట్లాడిన మాటలను ఖండిస్తూ శనివారం మంథని ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మంథని మండల అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జంజర్ల శేఖర్, మంథని సత్యం, ఆజీమ్ ఖాన్, యూత్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజు లు మాట్లాడుతూ ఇప్పటి వరకు కూడా మున్సిపల్ సిబ్బందికి జీతాలు చెల్లించ లేని మీరు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జేఎన్టీయూహెచ్ కళాశాలలో బహుజనులను తొలగించి ఒక్కొక్క ఉద్యోగానికి రేటు కట్టి అమ్ముకుంది మీరు కాదా అని ప్రశ్నించారు.మంథని లో డబుల్ బెడ్రూం మొదటి జాబితా లోని పేర్లు మార్చి డబ్బులు తీసుకొని నీ అనునాయులకు ఇచ్చింది నిజం కాదా అన్నారు. అంబేద్కర్ నగర్ (బర్రె కుంట) లోని దళితులకు ఎంత మందికి దళిత బంధు ఇప్పించావ్ చర్చకు సిద్ధమా అని పేర్కొన్నారు.నీకు అడ్డువచ్చిన వారిని నడి రోడ్డు పైన హత్య చేయించింది మీరు కాదా అని అన్నారు. తన జీతంతో వచ్చిన డబ్బులతో విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇప్పిచ్చిన ఘనత శ్రీధర్ బాబుకు దక్కుతుందన్నారు. అంబలి ఘటక తిన్నా అన్నా నువ్వు నెల నెల వచ్చే జీతంతోటే వేల కోట్లు సంపాదించావా అని మేము అడుగుతా ఉన్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోటి, దుద్దిల్ల శ్రీపాద రావు , శ్రీధర్ బాబు తోటి ఎదిగిన నువ్వు వారి పైన విమర్శలు చేయడం మంథని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని,ఇంకోసారి శ్రీపాద రావు పైన గాని శ్రీధర్ బాబు పైన గాని విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలి శ్రీనివాస్, బండారి ప్రసాద్ ,పెంటరి రాజు, ఎరుకల రమేష్, ధోరగొర్ల శ్రీనివాస్, ఎజాజ్, మంథని సమ్మయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, ఎరుకల మోహన్ సాయి ,పెరుగు తేజ, అరెల్లి కిరణ్, ఎరుకల శేఖర్ పొగుల సాగర్, మబ్బు తిరుపతి, రాధారపు నితీష్, ముజీమ్.పులి కృష్ణ.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2023 ఫలితాల్లో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థుల విజయభేరి

**కరీంనగర్**

నాణ్యతమైన విద్యలో సంచలనాలు సృష్టించవచ్చని, సమాజంలో ఉత్తమంగా ఉండవచ్చని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ పట్టణంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చెందిన 20 మంది విద్యార్థులు యం.బి.బి.ఎస్ సీట్ల కు అర్హత సాధించిన శుభసందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ సంవత్సరపు నీట్-2023 ఫలితాల్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్కు చెందిన జి.సంతోషిని 619 మార్కులు, డి. హస్వితా రెడ్డి 588 మార్కులు, నబిహా 558 మార్కులు, ప్రతిప్ కుందియా చక్రారాజు 530 మార్కులు, శికారి చందన 527 మార్కులు, పి. సాయి విష్ణుష్ రెడ్డి 515 మార్కులు, కె. శ్రీఫని 505 మార్కులు, కె. శ్రీనీ, కె. శశివర్ధన్, డి. జహ్నవి, ఎన్. నితిక, అల్ఫోర్స్ టైనిటాట్స్: డి. అదిత్య చంద్రకాంత్ రెడ్డి 615 మార్కులు, టి. దీపిక 571 మార్కులు, ఎస్. సాయి సదిష్న 570 మార్కులు, సి.హెచ్. శ్రీవేదాద్రిత 527 మార్కులు, వి. షైలేష్ కుమార్ 513 మార్కులు, మరియు పి.శశాంక్,అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్స్: దీరజ్ కుమార్ 610 మార్కులు మరియు ఇ. ఆశ్రీత్, అల్ఫోర్స్ గురుకుల విద్యాలయం: రాహుల్ 502 మార్కులు సాధించి పాఠశాలల కీర్తిని రెట్టింపు చేశారని అన్నారు.అర్హత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని స్ఫూర్తిదాయకమైన ఫలితాలను నమోదుచేయాలని ఆకాంక్షించారు.

# వీ ఆర్ ఎస్ కు తెలంగాణ హెల్త్ డైరెక్టర్..?

**ఖమ్మం :**

తెలంగాణ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ఏం చేసినా సంచలనమే. ఈ మధ్య తాను నడిపిస్తోన్న స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతూ తరచూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలతో మమేకమవుతున్నారు. ఈ క్రమంలోనే.. డీహెచ్ తన పదవికి వీఆర్ఎస్ ఇచ్చేసి.. పొలిటికల్ ఎంట్రీ ఇవ్వనున్నట్టు పెద్ద ఎత్తున వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కొత్తగూడెం సీటు కోసమే ఈ సేవా కార్యక్రమాల పేరుతో ప్రజలను మచ్చిక చేసుకుంటున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నారు. అయితే.. ఈ వార్తలతో పాటు కొంత మంది ఇంకో అడుగు ముందుకేసీ.. మరో ఇంట్రెస్టింగ్ న్యూస్‌ని వైరల్ చేస్తున్నారు. అదేంటంటే.. డీహెచ్ శ్రీనివాస్ ఇప్పటికే.. వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారని.. సోషల్ మీడియాలో వైరల్ చేసేస్తున్నారు. ఈ వార్తలపై శ్రీనివాస రావు స్పందించారు.

ఉద్యోగానికి రిజైన్ చేయబోతున్నట్టు, వీఆర్ఎస్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నట్టు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని శ్రీనివాస రావు స్పష్టం చేశారు. తాను ఏ నిర్ణయం తీసుకున్నా తప్పకుండా అందరికీ తెలియజేస్తానంటూ చెప్పుకొచ్చారు. కొత్తగూడెంలో ప్రజలకు సేవ చేయడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలో ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ తనకు ఇచ్చిన బాధ్యతలు నెరవేర్చడమే లక్ష్యంగా ప్రస్తుతం పనిచేస్తున్నానని.. భవిష్యత్తులోనూ ఎలాంటి కర్తవ్యం ఇచ్చినా నెరవేరుస్తానని డీహెచ్ శ్రీనివాస్ రావు వివరించారు.అంతే కాదు.. అందరూ కోరుకుంటున్నట్టుగా కొత్తగూడెం నుంచి తనను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశిస్తే తప్పకుండా పాటిస్తానంటూ స్పష్టం చేశారు కేసీఆర్. అయితే.. తాను ఏ నిర్ణయం తీసుకున్నా అందరికీ చెప్తానని.. కానీ.. అప్పటివరకు దయచేసి అసత్య ప్రచారాలు చేయొద్దని చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు డీహెచ్ శ్రీనివాస్ రావు. దీంతో.. తాను పొలిటికల్ ఎంట్రీకి సిద్ధంగా ఉన్నారని.. అది కూడా కొత్తగూడెం నుంచే పోటీ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నట్టు తేటతెల్లమయిపోయింది. ఇక వీఆర్ఎస్‌కు అప్లై చేసుకోవటమే తరువాయి.. వెంటనే గులాబీ కండువా కప్పుకోవటం.. కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించటం చకచకా జరిపోనున్నాయనే చర్చ సాగుతోంది

# కలిసి మాత్రమే అడుగులు

**హైదరాబాద్:**

తెలంగాణ కాంగ్రెస్‌లో .. కోదండరాంపార్టీ తెలంగాణ జన సమితి విలీనం అవుతందని కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై కోదండరాం స్పందించారు. హైదరాబాద్‌లో జూపల్లి కృష్ణారావుతో సమావేశం అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన .. కేసీఆర్ ను ఓడించడానికి కలిసి పని చేస్తాం కానీ.. విలీనం ప్రస్తావన అసలు లేదని స్పష్టం చేసారు. రాష్ట్రంలో ఉన్న నిరంకుశ పాలనను అంతమొందించి ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం అందరూ ఐక్యం కావాల్సిన అవసరం ఉందని.. అలాంటి ఐక్యతను సాధించే లక్ష్యంతో తప్పకుండా పనిచేస్తామని అన్నారు. అయితే విలీనం అనే ప్రసక్తే రాదన్నారు. టీజేఎస్‌ను విలీనం చేయాలన్న ప్రతిపాదనతో తనను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ కలిసారనే వార్తల్లో వాస్తవం లేదని.. అసలు చర్చలే జరగలేదని కోదండరామ్ స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు కలవాల్సిన అవసరం ఉందని, ఇక్కడ కేసీఆర్‌కు వ్యతిరేకంగా కాదని, ఒక ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరడంలేదని, నిరంకుశత్వం కొనసాగు తోందని.. దాన్ని అంతమొందిచడానికి అన్ని పార్టీలు కలిసి రావాల్సిన అవసరం ఉందని, రాబోయే ఎన్నికలపై రాష్ట్ర కమిటీ మీటింగ్‌లో చర్చలు జరిపి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామిక పాలన రావాలని, దాని కోసం మహాకూటమిగా ఏర్పాడాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ చైర్మన్ గా కీలక పాత్ర పోషించిన కోదండరాం.. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరలేదు. తెలంగాణ జన సమితి పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలతో కూడిన మహాకూటమిలో కలిసి పని చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలవద్దనే ఉద్దేశ్యంతో కూడా మహాకూటమిలో టీజేఎస్ చేరింది. అయితే అనుకూల ఫలితాలు రాలేదు. ఉద్యమ నేత రాజకీయ పార్టీ పెట్టినందున ప్రజల్లో అంచనాలు ఉన్నా? పార్టీ ఊహించిన స్థాయిలో బలోపేతం కాలేదు. ముదస్తు ఎన్నికల్లో సరైన ఫలితాలు రాకపోవడంతో కొంత మంది పార్టీని వీడి వెళ్లిపోయారు. ఆ తర్వాత పార్టీ నిర్మాణంపై దృష్టి సారించలేకపోయారు. ఆర్ఎస్ పాలనపై పూర్తి వ్యతిరేకంగా ఉన్న కోదండరాం ఎలాగైనా కేసీఆర్ గద్దె దిగాలని చూస్తున్నారు. కానీ, కోదండరాం ఒక్కరితో అది అయ్యే పనికాదు. ఒక ప్రొఫెసర్ గా? ఉద్యమ సారథిగా ఆయనకు తెలంగాణ పరిస్థితిపై పూర్తి అవగాహన ఉన్నందున కోదండరాంను కలుపుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కారణం ఏదైనా కోదండరాం ఇటీవల అంత చురుగ్గా లేరు.కానీ ఆయనకు కొంత ఇమేజ్ ఉంది. ఉద్యమకారునిగా ఆయన ఇమేజ్ పార్టీకి పనికి వస్తుందన్న ఉద్దేశంతో.. కాంగ్రెస్ పార్టీ విలీనానికి ప్రతిపాదిస్తోంది. కానీ కలిసి పని చేయడానికి సిద్ధమే కానీ.. విలీనానికి అంగీకరించేది లేదని ప్రొఫెసర్ చెబుతున్నారు.

# ప్రతీ కుటుంబానికి బీమా తప్పనిసరి

**-మంథని ఎంపీపీ కొండా శంకర్**

**మంథని**

ప్రతీ కుటుంబానికి బీమా తప్పనిసరి అని మంథని ఎంపీపీ కొండా శంకర్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన గూడ కవిత అనే మహిళ శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రూ. 32 వేల ప్రీమియంతో న్యూ శ్రీ లైఫ్ పాలసీ తీసుకున్నారు. రెండు సంవత్సరాల పాటు కంపెనీలో రూ. 32 వేల చొప్పున రూ. 64000 చెల్లించిన కవిత దురదృష్టవశాత్తు గుండెపోటుతో మృతి చెందారు. శ్రీరామ్ లైఫ్ లో పాలసీ తీసుకున్న కవిత కుటుంబానికి రూ.5,32,000ల క్లైమ్ అమౌంట్ మంజూరు కాగా నామిని చంద్రయ్యకు శనివారం ఎంపీపీ కొండా శంకర్, కంపెనీ ఏజీఎం అట్ల సురేష్ లు చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండా శంకర్ మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ చేసుకోవడం వల్ల డబ్బులు పొదుపు చేసుకోవడంతో పాటు కుటుంబానికి భద్రత కల్పించవచ్చన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తరుణంలో ఎవరికి ఎలాంటి హాని జరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. ఏదో రోజు జరుగుతుందని కాకుండా.. ఏమైనా జరిగితే మన కుటుంబానికి అండ ఉంది.. అనే విధంగా ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవాలన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రెండు సంవత్సరాల కాలంలో కేవలం రూ. 64000 చెల్లిస్తే బాధిత కుటుంబానికి రూ. 5,32,000 చెక్కు అందించడం నిజంగా అభినందనీయమన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన సేవలు అందిస్తూ గ్రామాల్లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ చాలా వేగంగా విస్తరిస్తుందన్నారు. ఏజీఎం అట్ల సురేష్ మాట్లాడుతూ.. 2047 వరకు స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు జీవిత బీమా చేసుకోవాలని ఐ ఆర్ డి ఏ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి తన ఆదాయానికి 10 రేట్లు జీవిత బీమా ఉండాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో మంథని, భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్లు చకినాల సంతోష్, పైడాకులు రమేష్, డెవలప్మెంట్ ఆఫీసర్ మర్రి రమేష్, పోతరాజు సమ్మయ్య, సేల్స్ మేనేజర్లు బాసాని సాగర్, మాచర్ల హరీష్, సేల్స్ ఆఫీసర్లు లక్కాకుల నాగరాజు, మేడగొని వెంకటేష్ గౌడ్, సిరిపురం ఎంపీటీసీ గుమ్మడి రాజయ్య, సింగరేణి డైరెక్టర్ పోచయ్య, గ్రామస్తులున్నా రు.

# కాంగ్రెస్ నేతలు ముక్కులు నేలకు రాయాలి

**మంత్రి జగదీష్ రెడ్డి**

**నల్గోండ**

ఐటి హబ్ అంటే ఏందో తెలుసా...అది తెలువకుండా దాని గురించి మాట్లాడితే చదువుకున్నోళ్లు మాత్రమే కాదు కంప్యూటర్ పై సరయిన పరిజ్ఞానం లేని వారు కూడా నవ్వుకుంటారని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఎద్దేవాచేశారు. అది తెలియాలి అంటే కనీస పరిజ్ఞానం ఉండాలి అని ఆయన దెప్పి పొడిచారు. పట్టణ ప్రగతి లో బాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జగదీష్ రెడ్డి అనంతరం మీడియా తో మాట్లాడారు.చదవని చదువు చదువుకున్నట్లు చెప్పి వై ఎస్ దగ్గర పదవులు పొంది డబ్బులు సంపాదించుకున్నట్లు కాదని ఐటీ హబ్ ల గురించి తెలుసుకోవడం అని ఆయన విరుచుకుపడ్డారు.20 ఏండ్లుగా అధికారం లో ఉండి నల్లగొండ అభివృద్ధికి చేసింది ఏమిటో తేల్చి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నేతల పాదయాత్రలో త్రాగేది ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన మంచి నీరు అని,కాంగ్రెస్ నాయకుల పొలాలకు,ఇళ్లకు అందుతున్న విద్యుత్ ముఖ్యమంత్రి కేసీఆర్ సరఫరా చేసిందేనని ఆయన మండిపడ్డారు. మాటి మాటికి అవాకులు చెవాకులు పేలుతున్న కాంగ్రెస్ నాయకులు చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. మీకు మాలాంటి నేతలఅక్కర లేదని అభివృద్ధిలో భాగస్వామ్యం అయి మాతో సెల్ఫీలు దిగుతున్న ప్రజలు సరితూగుతారని ఆయన చెప్పారు. మరోసారి ప్రజలను మోసం చేయడానికి దండు బయలు దేరిందని ఆ దండుపై ప్రజలకు విశ్వసనీయత లేదని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండ ను దత్తత తీసుకున్నాక రూపు రేఖలే మారి పోయాయని ఆయన చెప్పారు. ఆ మాటకు వస్తే కాంగ్రెస్ నేతలకు అభివృద్ధి గురించే కాదు వ్యవసాయం గురించి మాత్రం ఏమి తెలుసని ఆయన నిలదీశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క యాసంగి లొనే 17 వేల ధాన్యం దిగుబడి కాగా రైతులకు చెల్లించిన మొత్తం2,950 కోట్లు అని ఆయన చెప్పారు. క్షమాపణలు కాదు కాంగ్రెస్ నేతలే గల్లీ నుండి ఢిల్లీ వరకు 1000 సార్లు ముక్కులు నేలకు రాయాలని ఆయన డిమాండ్ చేశారు.ఫ్యూడల్ రాజకీయాలకు కాలం చెల్లిందని ఆయన స్పష్టం చేశారు.ఐదు ఎకరాల భూమి ఉంటే అన్న తమ్ముళ్లకు కోటాను కోట్ల బెంజి కార్లు ఎక్కడివని ఆయన నిలదీశారు.మళ్ళీ అధికారంలోకి వచ్చేది బి ఆర్ ఎస్ ప్రభుత్వమే ఇందులో ఎటువంటి సందేహం లేదని మంత్రి జగదీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# జూన్ 30న కాంగ్రెస్ కండువా కప్పుకోనున్న పొంగులేటి

**హైదరాబాద్ :**

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. ఆయన ఏ రోజు కాంగ్రెస్‌లో చేరబోతున్నారనే దానిపై కూడా స్పష్టత వచ్చింది. ఈ నెలాఖరున అంటే జూన్ 30న పొంగులేటి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. పొంగులేటితో పాటు జూపల్లి కృష్ణారావు తదితరులు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఈనెల 22న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పొంగులేటి, జూపల్లి, కూచూకుళ్ళ దామోదర రెడ్డి, పిడమర్తి రవి తదితరులు భేటీ కానున్నారు. భేటీ అనంతరం



తెలంగాణలో వేరువేరు బహిరంగ సభల్లో పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈనెల 30న ఖమ్మంలో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం సభలో పొంగులేటి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. ఈ సభకు రాహుల్ గాంధీ లేదా ప్రియాంక గాంధీ హాజరయ్యే అవకాశం ఉంది. పొంగులేటితో పాటు పాయం వేంకటేశ్వర్లు, కోరం కనకయ్య, పిడమర్తి రవి, తెల్లం వెంకట్రావు, బానోత్ విజయాబాయి, కోటా రాంబాబు, మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, కొండూరి సుధాకర్, జారే ఆదినారాయణ, దొడ్డా నగేష్ యాదవ్ హస్తం పార్టీలో చేరనున్నారు. అలాగే మహబూబ్‌నగర్ బహిరంగ సభలో జూపల్లి అండ్ టీమ్ కాంగ్రెస్ కండువా కప్పుకోనుంది. జూపల్లితో పాటు దామోదర్ రెడ్డి, మేఘారెడ్డి, కుచ్చారెడ్డి, తదితరులు కాంగ్రెస్‌లో చేరనున్నారు.

# కలకలం రేపుతున్న పెట్రోల్ నిప్పు సంఘటన

**గుంటూరు :**

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాజవోలులో పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ ను పెట్రోల్ పోసి కాల్చి చంపిన వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తన సోదరిని వేధిస్తున్నారని.. ప్రశ్నించినందుకు అతనిపై పాము వెంకటేశ్వరర్ రెడ్డి అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించారని మరణ వాంగ్మూలంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్ తెలిపారు. మరణవాంగ్మూలం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కీలక విషయాలను వెల్లడించారు. పదో తరగతి చదువే విద్యార్థి అమర్నాథ్‌ను పెట్రోల్ పోసి నిప్పు అంటించి చంపారని ప్రకటించారు. పదో తరగతి విద్యార్థి హత్యపై కేసు నమోదు చేశామని, ఈ ఘటనలో నలుగురు పాల్గొన్నారని ఎస్పీ ప్రకటించారు. ప్రధాన నిందితుడు పాము వెంకటేశ్వరరెడ్డితో పాటు మరో ముగ్గురు కూడా ఈ హత్యలు పాల్గొన్నారన్నారు. వారిలో ముగ్గురిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని ఎస్పీ చెప్పారు. అమర్నాథ్ సోదరిని వెంకటేశ్వర రెడ్డి వేదిస్తున్నాడని, ఈ విషయం తెలుసుకున్న అమర్నాథ్.. తన సోదరిని వేధిస్తున్నట్లు అందరికీ చెప్పారని వెంకటేశ్వర రెడ్డి ఆగ్రహించాడన్నారు. కక్ష పెంచుకుని అమర్నాథ్‌ను చంపడానికి కుట్ర చేశాడని ఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో రాజకీయ కోణం ఏమీ లేదని, వ్యక్తిగతంగా జరిగిన ఘటన మాత్రమేనన్నారు. దీనికి రాజకీయ రంగు పులమొద్దని ఎస్పీ ?జ్ఞప్తి చేశారు. గతంలో ఈ గొడవకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు లేదని, ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే అనుమానితులను అరెస్టు చేశామన్నారు. క్లూస్ టీం రెండు సార్లు ఘటనా స్థలాన్ని పరిశీలించిందని ఎస్పీ తెలిపారు.శుక్రవారం విద్యార్థి అమర్నాథ్ ను పాము వెంకటేశ్వర రెడ్డి, మరో ముగ్గురు యువకులు కలిసి దారుణంగా హత్య చేశారు. ట్యూషన్‌కు వెళ్లి వస్తున్న విద్యార్థిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విద్యార్థి హాహాకారాలతో స్థానికులు అక్కడకు చేరుకుని మంటలు ఆర్పి వేసి విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన విద్యార్థి మృతి చెందాడు. తన అక్కను వేధించడంపై ప్రశ్నించినందుకు అమర్నాథ్‌ను నిందితులు ఇంత దారుణంగా హత్య చేశారు. తనను ప్రశ్నించడంపై ఆగ్రహంతో స్నేహితులతో కలసి పాము వెంకటేశ్వర రెడ్డి... అమర్నాథ్‌ను పెట్రోలు పోసి తగలబెట్టాడు. పాము వెంకటేశ్వరరెడ్డి తాపీ పని చేస్తాడని చెబుతున్నారు. ఆయన గ్రామంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులతో కలిసి తిరుగుతూంటారు. వారి అండతోనే ఇలా నేరాలకు తెగబుడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బాలుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణను .. గ్రామస్తులు వెనక్కి పంపేశారు. ఆయన ఇస్తామన్న రూ. లక్ష సాయం వద్దని చెప్పి వెళ్లిపొమ్మన్నారు. దీంతో ఆయన వెళ్లిపోయారు.

# ఏసీబీ వలలో తెలంగాణ వర్శిటీ వీసీ

**హైదరాబాద్ :**

తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ రవీందర్ గుప్తా ఏసీబీ ఉచ్చులో పడ్డారు. శనివారం రోజు హైదరాబాద్ లోని తన నివాసంలో 50 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. గత కొంతకాలంగా తెలంగాణ యూనివర్సిటీలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణ నేపథ్యంలో ఏసీబీ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగాలు యూనివర్సిటీలో సోదాలు నిర్వహించాయి. ఆరోపణలకు తగ్గట్లే అక్రమ నియామకాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఏసీబీ నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా పరీక్షా కేంద్రం ఏర్పాటు కేసం ఓ వ్యక్తి నుంచి వీసీ రవీందర్ గుప్తా డబ్బులు డిమాండ్ చేశారు. ఈక్రమంలోనే బాధితుడు శంకర్ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. డబ్బులు ఇస్తానని చెప్పమని.. బాధితుడికి సూచించారు. బాధితుడు శంకర్ అధికారులు చెప్పినట్లుగా చేయగా.. శనివారం ఉదయం హైదరాబాద్ లోని వీసీ నివాసానికి వెళ్లి రవీందర్ గుప్తాకు డబ్బులు ఇవ్వబోయాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు వచ్చి 50 వేల రూపాయల లంచం తీసుకుంటున్న వీసీని పట్టుకున్నారు. అనంతరం ఆయన ఇంట్లో తనిఖీలు కూడా నిర్వహించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీసీ రవీందర్ గుప్తాను అదుపుకులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఏసీబీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. నిజామాబాద్ జిల్లాలోని డిచ్ పల్లి సమీపంలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక సోదాలు చేశారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనంలో సోదాలు చేశారు. అవినీతి ఆరోపణల రావడం వల్ల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అకౌంట్ సెక్షన్, ఏవో సెక్షన్, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లలో సోదాలు చేశారు. యూనివర్సిటీలోని కళాశాల భవనాల్లోనూ విజిలెన్స్ దాడులు జరిగాయి. ఈసీ మెంబర్లకు, వీసీకి మధ్య నెలకొన్ని గొడవలపై కూడా అధికారులు దృష్టి సారించారు. యూనివర్సిటీలో అక్రమ నియామకాలు, అక్రమ లావాదేవీలు జరిగాయని ఈసీ చర్యలకు దిగింది. వీసీ రవీందర్ గుప్తా అక్రమాలకు పాల్పడ్డారని రిజిస్ట్రార్‌ను మారుస్తామని ఈసీ ప్రకటించింది. దీనికి వ్యతిరేకంగా కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తూ వీసీ నిర్ణయం తీసుకున్నారు. దీంతో యూనివర్సిటీలో అడ్మినిస్ట్రేషన్ గందరగోళంగా మారింది. ఈసీ మెంబర్లకు, వీసీకి మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. అక్రమ నియామకాలు, లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తాజాగా రంగంలోకి దిగారు.హైదరాబాద్‌లోని రూసా భవనంలో జూన్ నెల 3వ తేదీన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన పరిణామాలు, గతంలో పాలక మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై కూలంకషంగా చర్చించారు. ఆ 60వ పాలక మండలి సమావేశానికి వీసీ రవీందర్ మరోసారి డుమ్మాకొట్టారు. వీసీ అక్రమాలు చేశారని, దానిపై విచారణ కమిటీ వేయాలని సమావేశంలో పాలకమండలి మెంబర్లు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. వీసీ చేసిన అక్రమ నియామకాలు, ఇతరుల పేర్ల మీద బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేయడం, దినసరి ఉద్యోగం కింద పని చేసిన వారికి ఈసీ అనుమతి లేకుండానే బ్యాంకు నుంచి రూ.28 లక్షలు చెల్లించిన అంశాలకు సంబంధించి కమిటీని వేసి చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు

# విశాఖ కిడ్నాప్ పై విచారణ జరిపించాలి

**బీజేపీ డిమాండ్**

**విశాఖపట్నం**

ఏపీ రాష్ట్రంలో రాజకీయం జరుగుతోందని.. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలుసుకుంటే బాగుంటుం దని బీజేపీ సీనియర్ నేత విష్ణుకుమార్ రాజు అన్నారు.ఎంపీ భార్య, కుమారు డు, ఆడిటర్ జీవిని బంధించి హింసిం చడం చాలా దారుణమన్నారు. భగవం తుని దయవల్ల క్షేమంగా బయటపడ్డా రని.. రెండు రోజులు వాళ్ళ ఇంట్లో తిష్ట వేయటం. దీనిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు.కిడ్నాప్ జరిగి తే బంధీలను తీసుకుని వెళతారని, కానీ ఇక్కడ అలా జరగలేదని విష్ణు కుమార్ రాజు అన్నారు.ఏపీ పోలీసు లు నిస్పాక్షిక విచారణ జరుపుతారనే నమ్మకం లేదని, దీనిపై రాష్ట్ర పోలీసు లతో కాకుండా, థర్డ్ పార్టీతో ఎంక్వయి రీ వేయాలని, సీబీఐ ఎన్ఐఏతో విచా రణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపీ కుమారుడి ఘటన వెనక, కడప, పులివెందుల బ్యాచ్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతోందన్నారు. నాలుగు రోజుల ముందు నుంచి, ఋషికొండ ప్రాంతంలో సెల్ ఫోన్ డేటా బయటకు తీస్తే మొత్తం వ్యవహారం బయటకు వస్తుందన్నారు.

# జూలై 7 తర్వాతే తెలంగాణ

## తేల్చి చెప్పిన ప్రియాంక

**న్యూఢిల్లీ :**

తెలంగాణ కాంగ్రెస్ నాయకుల ఉత్సాహంపై అగ్రనేత ప్రియాంక వధేరా గాంధీ నీళ్ళు జల్లారా? తాజాగా న్యూఢిల్లీలో ప్రియాంకతో భేటీ అయిన తర్వాత భువనగిరి ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట రెడ్డి చెప్పిన మాటలు అదే అంశాన్ని చాటుతున్నాయి. కర్నాటక ఫలితాలను తెలంగాణలో రిపీట్ చేస్తామని భావిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రకరకాల కార్యక్రమాలతో జనంలోకి వెళ్ళాలని తలపెట్టారు. ఇదివరకే సభలు, సమావేశాలను ఓవైపు కొనసాగిస్తూనే ఇంకోవైపు ఇతర పార్టీల్లోని అసంతృప్తులను చేర్చుకునే దిశగా టీపీసీసీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం ముగిసిన వెంటనే హైదరాబాద్ నగరంలో ప్రియాంక సభను నిర్వహించే యూత్ డిక్లరేషన్ ప్రకటించారు. అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ వంటి హామీలను గుప్పించారు. ఇక తెలంగాణకు తరచూ అగ్రనేతల రాకపోకలుంటాయని మీడియాకు ఉప్పందించారు తెలంగాణ కాంగ్రెస్ నేతలు. దాంతో మీడియాలో రాహుల్, ప్రియాంక ఒకరు కాకపోతే మరొకరు వారం విడిచి వారం తెలంగాణకు వస్తారని, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు ప్రజాభిమానాన్ని చురగొంటారని కథనాలు రాసుకొచ్చాయి. అయితే, ఇదంతా జరిగి నెలన్నర కావొస్తోంది. ఇప్పటికి అగ్రనేతలెవరూ రాలేదు. కాకపోతే కర్నాటక విజయం తర్వాత కొన్ని సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది ఏఐసీసీ. ఏఐసీసీ కార్యదర్శుల హోదాలో తెలంగాణ వ్యవహారాల ఇంచార్జులుగా వున్న వారిని మార్చి కొత్త వారిని నియమించింది. ఇక ఈక్రమంలో గత 90 రోజులుగా పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ శాసన సభాపక్షం నేత మల్లు భట్టవిక్రమార్కకు వెన్నుదన్నుగా ప్రియాంక రంగంలోకి దిగుతారని ప్రచారం జరిగింది. పాదయాత్ర ముగింపుగా ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సభకు ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తున్నట్లుగా చెప్పుకున్నారు. కానీ తాజాగా కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఢిల్లీ పర్యటన తర్వాత ఇదేదీ నిజం కాదన్నట్లు తేలిపోయింది. జూన్ నెలలో ప్రియాంక తెలంగాణకు రావడం లేదని తేలిపోయింది. అటు రాహుల్ గాంధీ ఏమో అమెరికా పర్యటనలో వున్నారు. ఆయనా వచ్చే ఛాన్స్ లేదు. ఇటు ప్రియాంక జులై 7 తర్వాత తెలంగాణకు వస్తానని చెప్పారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. దాంతో భట్టి పాదయాత్ర ముగింపు సభకు అగ్రనేతలెవరూ వచ్చే అవకాశాలు లేనట్లేనని పరిశీలకులు అంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఉత్సాహంపై ప్రియాంక నీళ్ళు జల్లినట్లేనని గాంధీభవన్ వర్గాలు చెప్పుకుంటున్నాయిఇక్కడ ఓ ఆసక్తికరమైన అంశం కనిపిస్తోంది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తనను కలిసినపుడు మీ సోదరుడు పార్టీలోకి వస్తున్నారా అని ప్రియాంక అడిగినట్లు తెలుస్తోంది. దీనికి సమాధానంగా అందరూ పార్టీలోకి వస్తారంటూ నర్మగర్భ సమాధానం చెప్పారు వెంకటరెడ్డి. ఈ లెక్కన కొంతకాలంగా బీజేపీలో అంతగా యాక్టివ్‌గా లేని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరిగి సొంతగూటికి చేరుకుంటారా అన్న సందేహం మొదలైంది. ఈ అంశాన్ని పక్కన పెడితే తెలంగాణలోను కర్నాటక ఫార్ములాను అమలు పరిచే ఉద్దేశంతో కాంగ్రెస్ అధినాయకత్వం వున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ వ్యవహారాలను మరీ ముఖ్యంగా ఎలెక్షన్ మేనేజ్‌మెంటును కర్నాటక పీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డికే శివకుమార్‌కు కట్టబెడుతున్నట్లు వార్తలొస్తున్నాయి. మనీ సర్దుబాటు దగ్గర నుంచి ఆపరేషన్ ఆకర్ష నిర్వహణ దాకా డికే సిద్ధహస్తుడని పేరుంది. ఈ ఉప్పందడంతోనే తెలంగాణ కాంగ్రెస్ నేతలు పలువురు బెంగళూరుకు క్యూ కట్టినట్లు తెలుస్తోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇదివరకే నాలుగు సార్లు బెంగళూరు వెళ్ళి వచ్చారు. పొన్నం ప్రభాకర్ లాంటి వారు సైతం అదే పనిలో వున్నారు. ఇక ఆశ్చర్యమేమిటంటే తెలంగాణలో రాజకీయ అదృష్టాన్ని వెతుక్కుంటూ ఏపీలోని కడప నుంచి వచ్చిన షర్మిల సైతం రెండు సార్లు బెంగళూరు వెళ్ళి డికేని కలిసి వచ్చారు. దాంతో ఆమె తన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తున్నారని కథనాలు వచ్చాయి. దానిని ఆమె తిరస్కరించినా ఆ ఊహాగానాలకు తెరపడకపోవడం విశేషం. తన తండ్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఆప్తుడవడం వల్లనే తాను డికేని కలిసినట్లు షర్మిల చెప్పుకుంటున్నారు. అయితే, తన సోదరుడు, ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డితోపాటు షర్మిలకు బెంగళూరులో భారీ ఎత్తున ఆస్తులున్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హమేనని చెప్పుకోవాలి. కర్నాటకలో యూజ్ చేసి, మంచి ఫలితాలు రాబట్టిన మరో ఫార్ములాను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ వాడుకునే అవకాశం వున్నట్లు వెంకటరెడ్డి మాటల్లో వెల్లడైంది. ఎన్నికలకు చాలా ముందుగానే దాదాపు 50 నుంచి 60 శాతం అభ్యర్థుల పేర్లను ఖరారు చేయడం ద్వారా వారు వారి నియోజకవర్గంలో చాలా ముందుగానే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని పార్టీ హైకమాండ్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు 2 లేదా 3 నెలల ముందే 60 శాతం సీట్ల ప్రకటన ఉంటుందని వెంకటరెడ్డి.. ప్రియాంకతో భేటీ తర్వాత చెప్పారు. ఇక అగ్రనేతల పర్యటనల విషయంలోను ప్లానింగ్ జరుగుతున్నట్లు బోధపడుతోంది. 3 నెలల్లో తెలంగాణలోని 33 జిల్లాల్లో పర్యటించేలా రాష్ట్రానికి సమయం కేటాయించాలని ప్రియాంకను తాను కోరినట్లు వెంకటరెడ్డి చెబుతున్నారు. జులై 7 తర్వాత తెలంగాణకు వస్తానని ప్రియాంక.. వెంకటరెడ్డి ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఓకే చెప్పినట్లు భావించాలి. ఇక చేరికల విషయంలో టీపీసీసీ ప్లానింగ్ పక్కాగా కనిపిస్తోంది. అయితే, బోలెడు ఆశలు పెట్టుకున్న ఖమ్మం మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంకా ఎటూ తేల్చకపోవడంపై టీపీసీసీ నేతలు లోలోపల టెన్షన్ పడుతున్నా.. పైకి మాత్రం గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పొంగులేటితోపాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమని, కేవలం సభ నిర్వహన తేదీపైనే ఇంకా క్లారిటీ రావడం లేదని చెబుతున్నారు. అయితే, జూన్ 14వ తేదీనే తాను ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గత వారం చెప్పారు. కానీ ఆ తేదీ దాటిపోయినా ఆయన నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. తాజాగా ఆయన ఏం ఆలోచన చేస్తున్నారన్నదానిపై కాంగ్రెస్ నేతలతోపాటు బీజేపీ నేతలు కూడా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

# సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనడానికి భారతీయ జనతా పార్టీ భయపడుతోంది

**జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్**

**పాట్నా:**



సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనడానికి భారతీయ జనతా పార్టీ భయపడుతోందని బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ అన్నారు. అదే సమయంలో హిందుస్థాన్ అవామ్ మోర్చా-సెక్యులర్ వ్యవస్థాపకుడు జీతన్ రామ్ మాంఝీ పై తీవ్ర ఆరోపణలు చేశారు. బిహార్ అధికార కూటమి మహాకూటమి పార్టీలపై ఆయన బీజేపీ తరపున గూఢచర్యం చేస్తున్నారని ఆరోపించారు. హెచ్ఏఎంఎస్‌ను జేడీయూలో విలీనం చేయడానికి ఇష్టపడటం లేదు కాబట్టి ఆ పార్టీ ఇకపై మహాకూటమిలో భాగంగా ఉండబోదని చెప్పారు. నితీశ్ కుమార్ శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఈ నెల 23న ప్రతిపక్షాల సమావేశం జరుగుతుందని చెప్పారు. ప్రతిపక్షాల మధ్య ఐక్యత పెరుగుతుండటంతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు. ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే తనకు నష్టం జరగవచ్చునని బీజేపీ భయపడుతోందన్నారు. అందుకే ముందస్తు ఎన్నికలు రావచ్చునని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మహాకూటమి పార్టీలపై మాజీ ముఖ్యమంత్రి మాంఝీ బీజేపీ తరపున గూఢచర్యం చేస్తున్నారని ఆరోపించారు. హెచ్ఏఎంఎస్‌ను జేడీయూలో విలీనం చేయడానికి ఇష్టపడటం లేదు కాబట్టి ఆ పార్టీ ఇకపై మహాకూటమిలో భాగంగా ఉండబోదని చెప్పారు. ఈ నెల 23న జరిగే ప్రతిపక్షాల సమావేశంలో పాల్గొనాలని మాంఝీ కోరుకున్నారని, అయితే ఆయన ఈ సమావేశం వివరాలను బీజేపీకి చెప్పేస్తారనే భయం వల్ల ఆయనను ఆహ్వానించలేదన్నారు. మాంఝీ స్పందిస్తూ, మహా కూటమి నుంచి బయటపడటం వల్ల తమకు గొప్ప విముక్తి లభించినట్లయిందన్నారు. తమ పార్టీ త్వరలోనే తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తుందన్నారు. మాంఝీ కుమారుడు సంతోష్ సుమన్ ఇటీవలే నితీశ్ మంత్రివర్గం నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. జేడీయూలో హెచ్ఏఎంఎస్ విలీనమవాలనే ప్రతిపాదన రావడంతో ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

# బిసిలకు లక్ష సాయం నిరంతర ప్రక్రియ

**ప్రతీ నెల 15వ తారీఖున పథకం గ్రౌండింగ్**

**సంపూర్ణంగా ఆన్లైన్లోనే అప్లికేషన్, ఏ ఆపీసుకు వెల్లాల్సిన, ఎవరినీ కలువాల్సిన అవసరం లేదు**

**బిసిలకు లక్షసాయంపై మంత్రి గంగుల అధ్యక్షతన సమావేశమైన కాబినెట్ సబ్ కమిటీ**

**హైదరాబాద్**



తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల కులవృత్తుల్లోని చేతివృత్తుల వారి జీవన ప్రమాణాలు పెంచడానికి కేసీఆర్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బిసీలకు లక్ష పథకంపై నేడు హైదరాబాద్లోని డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్యక్షతన కాబినెట్ సబ్ కమిటీ బేటీ అయ్యింది. మంత్రులు హరీష్ రావ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్లు హాజరయ్యారు. వ ధ కం తొలిదశ అమలును బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రావెంకటేశం కాబినెట్ సబ్ కమిటీకి వివరించారు, అమలు తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రులు అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. వివరాలను మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ గారు నిరంతరం తపిస్తారని, కులవృత్తుల్లోని చేతివృత్తులకు చేయూతనిచ్చేందుకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రత్యేకంగా లక్ష రూపాయల సాయాన్ని ప్రకటించారన్నారు. దీంట్లో ఈ రోజువరకూ 2,70,000 ధరఖాస్తులు ఆన్లైన్లో నమోదయ్యాయని, బిసీలకు లక్ష సాయం నిరంతర ప్రక్రియ అన్నారు. మొదటగా అర్హతకలిగిన లబ్దీదారుల్లోని అత్యంత పేదవారికి అందజేస్తూ ప్రతీ నెల 5వ తారీఖులోపు కలెక్టర్లు లబ్దీదారుల జాబితాను ప్రభుత్వానికి పంపించాలని, ఇంచార్జి మంత్రులు ధ్రువీకరించిన జాబితాలోని లబ్దీదారులకు ప్రతీ నెల 15వ తారీఖున స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తామన్నారు. ఎంపికైన లబ్దీదారులు నెలరోజుల్లోపు తమకు నచ్చిన, కావాల్సిన పని ముట్లను, సామాగ్రిని కొనుక్కోవాలని సూచించారు గంగుల, లబ్దీదారుల నిరంతర అభివృద్ది కోసం అధికారులు పర్యవేక్షిస్తారని, నెలలోపు లబ్దీదారులతో కూడిన యూనిట్ల పోటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుదన్నారు మంత్రి గంగుల కమలాకర్. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బి వెంకటేశం, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంట కాలువలోకి దూసుకు పోయిన పల్లె వెలుగు

**విజయవాడ**

పెదపారుపూడి మండలం లో తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుండి గుడివాడ వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు వానపాముల వద్ద అదుపుతప్పడంతో పక్కనే ఉన్న పంట బోధిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 68 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముందు వెళ్తున్న ఆటో సడన్ బ్రేక్ వేయడంతో, దానిని తప్పించే క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా బస్సు అదుపుతప్పి బోదేలోకి వెళ్లిందని బస్సు డ్రైవర్ తెలియజేశాడు. గుడివాడ కంకిపాడు రహదారిపై తరచూ ప్రమాదాల కారణంగా అనేక మంది అమాయకులు చనిపోతున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పెదపారుపూడి మండలం లో తృటిలో పెను ప్రమాదం తప్పింది. విజయవాడ నుండి గుడివాడ వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు వానపాముల వద్ద అదుపుతప్పడంతో పక్కనే ఉన్న పంట బోధిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 68 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ముందు వెళ్తున్న ఆటో సడన్ బ్రేక్ వేయడంతో, దానిని తప్పించే క్రమంలో రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా బస్సు అదుపుతప్పి బోదేలోకి వెళ్లిందని బస్సు డ్రైవర్ తెలియజేశాడు. గుడివాడ కంకిపాడు రహదారిపై తరచూ ప్రమాదాల కారణంగా అనేక మంది అమాయకులు చనిపోతున్న అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# మడికి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**నలుగురు ఘటనా స్థలంలోనే మృతి**

**ఆరుగురికి తీవ్ర గాయాలు**

**కోనసీమ**

అంబేద్కర్ కొనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని మడికి 216(ఏ)జాతీయ రహదారిపై ఈరోజు తెల్లవారుజామున సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది.. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించినట్లు రావులపాలెం సర్కిల్ సిఐ రజని కుమార్ తెలియజేశారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముందుర్తి గ్రామానికి చెందిన 9 మంది వ్యక్తులు ఏపీ 35 డబ్ల్యు 2306 నెంబర్ గల టాటా ఏసీ పై మందపల్లి దైవ దర్శనానికి వెళుతుండగా, విశాఖపట్నం ఎయిర్పోర్ట్ వద్ద నుండి పాలకొల్లు వెళ్తున్న ఏపీ 39 సి 2266 నెంబర్ గల ఫోర్డు టిటానియం కారుతో అతి వేగంగా వచ్చి టాటా ఏసీ వాహనాన్ని బలంగా ఢీకొనడంతో టాటా ఏసీ ఆవాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు, కార్ లో ఉన్న డ్రైవర్ తో సహా నలుగురు వ్యక్తులు అక్కడికి అక్కడే మృతి చెందారు. మిగిలిన ఆరుగురిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలియజేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

# సోమశిలను సైకో ధ్వంసం చేసాడు

**ఆత్మకూరు**

అనంతసాగరం బహిరంగ సభలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. నారా లోకేష్ ప్రజల ఆశీస్సులతో 1600 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆత్మకూరు లో తట్టెడు మట్టి వెయ్యలేదు. ఇక్కడ ప్రజలకు ఇసుక దొరకకుండా చేసి వైసిపి నేతలు ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సోమశిల ప్రాజెక్టు డ్యామేజ్ అయితే మరమ్మత్తుల కోసం వైసిపి ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదని అన్నారు.

నేను వైసిపి నుండి గెలిచిన మూడు నెలల్లోనే వైసిపి ప్రభుత్వం మాఫియా రాజ్యం అయిపోయింది అని చెప్పాను. రైల్వే లైన్, ప్రభుత్వ ఆసుపత్రి అన్ని వైసిపి ప్రభుత్వం లో నిర్లక్ష్యానికి గురయ్యాయి. రాబోయేది టిడిపి ప్రభుత్వమే, సిఎం కాబోయేది చంద్రబాబు, యువతకు భవిష్యత్తు ఇచ్చేది లోకేష్. ఆత్మకూరు ని అభివృద్ధి చేయబోయేది టిడిపి. ఆత్మకూరు కి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని కోరుతున్నాను. వైసిపి ది విధ్వంసకర ప్రభుత్వం. కొత్తవి కట్టడం వీళ్ళకి చేతకాదు. అందుకే ఇది సైకో ప్రభుత్వం. ప్రభుత్వ భవనాన్ని ప్రభుత్వమే కూల్చేసింది అంటే తన పతనాన్ని తనే కోరుకుంది. సోమశిల ప్రాజెక్టు ను సైకో ధ్వంసం చేశాడు. సోమశిల ఉత్తర కాలువను నాశనం చేసాడు. సైకో పోవాలి... సైకిల్ రావాలని అయన అన్నారు.

# మంత్రులు నోరు అదుపులోకి పెట్టుకోవాలి

**నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం జనసేన పార్టీ కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ ఇంచార్జి, ఖంఅ సభ్యులు,రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మెన్ బొమ్మిడి నాయకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారులను జగన్ ప్రభుత్వం మభ్యపెడుతుందని. జనసేన నర్సాపురం నియోజకవర్గ ఇన్చార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. అటు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గంలోనూ మత్స్యకారులకు మేలు చేశామని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్న మంత్రులు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించిక తప్పదు అన్నారు. ఈనెల 24, 25వ తేదీలలో జరగబోయే వారాహి యాత్రను జనసేన నాయకులు, అభిమానులు అందరూ జయప్రదం చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. రాబోయే కాలంలో పవన్ సీఎం అవ్వడం తథ్యమని దానిని ఎవరు ఆపలేరని నాయకర్ స్పష్టం చేశారు. ప్రజల్లో పవన్ కు పెరుగుతున్న ఆదరణ చూసే వైసీపీ నాయకులు ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నరని దానిని ప్రజలందరూ గమనిస్తున్నారని ఎన్నికలలో అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. వై.సి.పి మంత్రి సిదిరి అప్పలరాజు. పేర్ని నాని పవన్ కళ్యాణ్ పై చేస్తున్న విమర్శలపై వైసిపి మంత్రుపై ఫైర్ అయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, జన సైనికులకు, వీర మహిళలు పాల్గొన్నారు.

# కరప మండలంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం

**కాకినాడ**

విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాడు- నేడు కార్యక్రమం ద్వారా అనేక మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థినీ విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకుని వెళ్లడం జరుగుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలంలో వివిధ గ్రామాల్లో గల తొమ్మిది జిల్లా పరిషత్ ప్రాథమికఉన్నత పాఠశాలలోని 2022-2023 సంవత్సరంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతూ పదవ తరగతి పరీక్షల్లో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా సత్కారం నగదు బహుమతి కార్య క్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మండలంలోని 18 మంది విద్యార్థులకు నగదు బహుమతిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పిటిసి సభ్యులు యాళ్ల సుబ్బారావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశా జ్యోతి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు , ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

# అల్లు అర్జున్ సరికొత్త బ్రాండింగ్ క్యాంపెయినింగ్‌తో మ్యాజిక్ క్రియేట్ చేస్తున్న నెంబర్ వన్ తెలుగు ఓటీటీ మాధ్యమం 'ఆహా'

తెలుగు నెంబర్ వన్ ఓటీటీ మాధ్యమం ఆహా.. అన్నీ వర్గాల ప్రేక్షకులకు తిరుగులేని ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోంది. ఆహా ఒరిజినల్స్, బ్లాక్ బస్టర్ మూవీస్, రియాలిటీ షోస్, టాక్ షోస్, కొరియన్ డ్రామాస్, హాలీవుడ్ మూవీస్, డెయిలీ సీరియల్స్, పిల్లల కోసం ఆహా కిడ్స్, న్యూస్ అండ్ గేమింగ్ ఇలా అందరీ మెప్పిస్తూ ముందుకు సాగుతోంది ఆహా. కుటుంబం, స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేసే మధుర క్షణాలను ఈ మాధ్యమం మన ముందుకు తీసుకు వస్తుంది. విభిన్నమైన భావోద్వేగాలను ఈ ప్రపంచానికి అందిస్తోన్న ఆహా ఇప్పుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, చార్మింగ్ స్టార్ శ్రీలీలతో '100% వెరైటీ, 100 తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్' క్యాంపెయినింగ్‌ను ప్రారంభించింది.

మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్ వంటి స్టార్స్‌తో భారీ చిత్రాలను రూపొందించటమే కాకుండా ఐకాన్ స్టార్‌తో ఇంతకు ముందు అల వైకుంఠపురములో, జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ క్యాంపెయినింగ్‌ను డైరెక్ట్ చేశారు.ఆహాలోకి ఓ కొత్త ప్రేక్షకుడు వచ్చాడంటే, అది కేవలం ఆ వ్యక్తిపైమాత్రమే కాదు .. ఆ కుటుంబంపై ఆహా గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది. యాక్షన్, రొమాన్స్, డాన్స్, డ్రామా.. ఇలా అన్నీ జోనర్స్ బ్యాక్ డ్రాప్స్‌లకు సంబంధించిన సన్నివేశాలతో తెలుగు ప్రేక్షకులకు ఆహా నిరంతరం కనెక్ట్ అవుతుంది. ఇది రోజువారీ జీవితంలో ఆహా యొక్క ప్రాముఖ్యతను అందరికీ ఇంకా బలంగా తెలియజేస్తుంది. ఇప్పుడు ఆహా ప్రారంభించిన ఈ సరికొత్త క్యాంపెయినింగ్ ద్వారా ప్రేక్షకులందరూ వారి కుటుంబాలతో, స్నేహితులతో కలిసి ఉండేలా ప్రతీ క్షణాన్ని ఎంతో గొప్పగా మార్చి వేస్తుంది ఆహా. ఈ సందర్భంగా ఆహాకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోన్న అల్లు అర్జున్ మాట్లాడుతూ "ఆహాతో మరోసారి కలిసి పనిచేయటం ఎంతో ఆనందంగా ఉంది. మూడేళ్ల ప్రయాణంలో ఆహా ఎందరో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. అందుకు కారణం.. నిరంతరం వైవిధ్యమైన కంటెంట్‌ను అందించటమే. డిఫరెంట్ ఎంటర్‌టైన్మెంట్ కోరుకునే ప్రేక్షకులందరికీ ఇదొక గమ్యస్థానంగా మారింది. ఒక యాక్టర్‌గా ఆహా ఇంకా ప్రేక్షకుల హృదయాల్లో బలమైన స్థానాన్ని ఏర్పరుచుకోవాలని కోరుకుంటున్నాను. ముమ్ముందు ఆహాతో ఈ అనుబంధం ఇంకా బలంగా కొనసాగాలని కోరుకుంటున్నాను" అన్నారు.

స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ "ప్రేక్షకుల సాధారణ జీవితాల్లో భాగం కావటానికి ఆహా ఎలప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. వారి కంటెంట్‌ను 6 ఏళ్ల వయసు నుంచి 65 ఏళ్ల వయసున్న వారి వరకు వీక్షించవచ్చు. తాజాగా ఆహా ప్రారంభించిన 100 % వెరైటీ 100% తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్ క్యాంపెయినింగ్ ఆడియెన్స్ జీవితాల్లోకి మరింత ఆనందాలను తీసుకువస్తుంది. ప్రతీ కంటెంట్‌ను అందులో జోనర్‌ను ఆవిష్కరించేలా ఈ క్యాంపెయినింగ్‌ను రూపొందించాం. మేం ఏం చెప్పాలనుకున్నామో ఆ కథను మరింత సరళంగా చెప్పే ప్రయత్నం చేశాం. మా ప్రయత్నం ఇంకా బలంగా, భావోద్వేగంగా ప్రేక్షకుల మనసుల్లో నాటుకుపోతుంది' అన్నారు.

ఆహా సీఇఓ రవికాంత్ సబ్బవిష్ మాట్లాడుతూ "మేం ఇది వరకే అన్‌లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తామని చెప్పాం. ఇప్పుడు ప్రారంభించిన 100% వెరైటీ, 100% తెలుగు ఎంటర్‌టైన్‌మెంట్ క్యాంపెయినింగ్ అనేది మా కమిట్‌మెంట్‌ను మరింత పెంచింది. దాన్ని మేం ఇంకా గొప్పగా నిలబెట్టుకుంటాం. ప్రేక్షకుల ప్రాధాన్యతలకు ప్రాముఖ్యత ఇవ్వాలి. అది మా ఆడియెన్స్‌ను



ఆకట్టుకునేలా గొప్పగా ఉంటూనే వారికి అర్థమైయ్యేలా సులభతరంగా ఉండాలని మేం భావిస్తూనే ఉంటాం. మా వద్ద లక్షల్లో ప్రేక్షకులున్నారు. వారందరికీ విభిన్నంగా వినోదాన్ని అందించేలా ఓ గమ్యంలాగా మేం మారుతున్నాం. సినిమాలు, సీరియల్స్, వెబ్ సిరీస్, గేమ్స్ నుంచి న్యూస్ ఇలా ఏదైనా ప్రేక్షకులకు కావాల్సిన వినోదం మా దగ్గరే లభ్యమవుతుంది" అన్నారు.

టాలీవుడ్ ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్, ప్రముఖ మై హోం గ్రూమ్ సంయుక్తంగా 2020లో ఆహాను ప్రారంభించారు. తెలుగు, తమిళ ప్రేక్షకుల కోసం లోకల్ కంటెంట్‌ను అందించే గమ్యస్థానంగా ఆహా మారింది. బలమైన బ్రాండింగ్, ఆకర్షణీయమైన సబ్‌స్క్రిప్షన్ ఆఫర్స్‌లతో ఆహా సూపర్ ఎంటర్‌టైన్మెంట్ యాప్‌గా ఆవిష్కరించబడింది. దీని ఫలితంగా ఈరోజు దేశంలోనే నెంబర్ వన్ ప్రాంతీయ ఓటీటీ మాధ్యమంగా ఆహా అవతరించింది. 32 మిలియన్ యాడ్ డౌన్‌లోడ్స్, 12 మిలియన్ యాక్టివ్ యూజర్స్ ఇందులో ఉన్నారు. ఇంత పెద్ద నెంబర్ అనేది ఆహాపై తెలుగు ప్రేక్షకులు ఉంచిన నమ్మకాన్ని, విధేయతను తెలియజేస్తుంది. 2000 గంటలకు పైగా అసాధారణమైన కంటెంట్, 350కు పైగా ప్రత్యేకమై ప్రోగ్రామింగ్‌తో ప్రేక్షకులకు ఆహా నాణ్యమైన వినోదాన్ని అందిస్తూ క్వాలిటీ ఎంటర్‌టైన్మెంట్ అనే పదానికి పర్యాయ పదంగా మారింది.

**ఆహా గురించి...**

2020లో ఆహా ప్రారంభమైంది. 100 % లోకల్ ఎంటర్‌టైన్మెంట్‌ను అందించే ఇండియన్ వీడియో ఆన్ డిమాండ్ స్ట్రీమింగ్. ఈ 100% ఓటీటీ మాధ్యమం సినిమాలు, సిరీస్‌లు, షోష్ ఇలా తిరుగులేని వినోదాన్ని ప్రేక్షకులకు అందిస్తూ ప్రపంచ వ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటోంది. ప్రతీ శుక్రవారం ఓ కొత్త రిలీజ్‌తో ప్రేక్షకులను అలరిస్తోంది. 100% లోకల్ ఎంటర్‌టైన్మెంట్‌ను అందిస్తామనే మాటను నిలబెట్టుకున్న ఆహా తమిళంలో 100 % లోకల్ ఎంటర్‌టైన్మెంట్‌ను సిరీస్‌లు, సినిమాల రూపంలో అందించటాన్ని ఈ మధ్యనే ప్రారంభించింది. అర్హ మీడియా అండ్ బ్రాడ్ కాస్టింగ్ ప్రై.లి, మై హోం గ్రూప్, అల్లు అరవింద్ (గీతా ఆర్ట్స్) వారి జాయింట్ వెంచర్ ఆహా.

## మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 140 కోట్లు కలెక్ట్ చేసి రికార్డ్ సృష్టించిన ఆదిపురుష్ ..



ప్రభాస్, కృతి సనన్, సైఫ్ అలీఖాన్ నటించిన "ఆది పురుష్" సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. అడ్వాన్స్ బుకింగ్ కలెక్షన్ల తోనే బాక్సాఫీస్ వద్ద భారీ తుఫాను సృష్టించిన ఈ సినిమా గ్లోబల్ బాక్స్ ఆఫీస్ వద్ద ?140 కోట్లతో అద్భుతమైన ఓపెనింగ్ డే రెస్పాన్స్‌ని అందుకుంది. బిజినెస్ పరంగా కూడా ఆదిపురుష్ మొదటి రోజు బాక్సాఫీస్ ను షేక్ చేసింది. టాప్ 5 లో నిలిచిన ఏకైక హిందీ చిత్రంగా రికార్డ్ సృష్టించింది ఈ సినిమా.

అన్నీ షోస్ హౌస్‌ఫుల్ గా నడుస్తుండడంతో, ఆదిపురుష్ అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అద్భుతమైన కథాంశం మరియు కథను మన ముందుకు తెచ్చిన విధానం అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రతి ఫ్రేమ్ తో పిల్లలకు మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తోంది ఈ సినిమా. ఈ మాగ్నమ్ ఓపస్ ఒక విజువల్ ట్రీట్ గా మొదటి నుండి చివరి వరకు యువత ను కట్టిపడేస్తుంది. అందరికీ ఒక మరపురాని అనుభూతిని కలిగిస్తున్న ఈ చిత్రం కలెక్షన్ల పరంగా కూడా స్ట్రాంగ్ గా కొనసాగుతూ ప్రపంచవ్యాప్తంగా కూడా రికార్డులు సృష్టిస్తోంది.

ఆదిపురుష్ సినిమా కి ఓం రౌత్ దర్శకత్వం వహించారు మరియు ౹-సిరీస్, భూషణ్ కుమార్ ఢ క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్ మరియు రెట్రో ఫైల్స్‌కు చెందిన రాజేష్ నాయర్ మరియు జు౦ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది.

## రేపు విడుదల కానున్న కాజల్ అగర్వాల్ నెక్ట్స్ సినిమా గ్లింప్స్..




స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరొక సినిమా తో తిరిగి ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. తన నెక్ట్స్ చిత్రం చకాజల్ 60 లో ఆమె ఒక పవర్ ఫుల్ పాత్రలో వెండి తెరపై కనిపించడానికి సిద్ధంగా ఉంది. తాజాగా జూన్ 19 న ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర నిర్మాతలు రేపు ఒక గ్లింప్స్ వీడియో ను విడుదల చేయనున్నారు. అఖిల్ దేగల సినిమా కి దర్శకత్వం వహించారు. ఇందులో కాజల్ మునుపెన్నడూ కనిపించని విధంగా ప్రేక్షకులు ఇష్టపడే పాత్రలో కనిపించనుంది.

అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క ఈ చిత్రాన్ని తమ ప్రొడక్షన్ లో మొదటి సినిమా గా నిర్మిస్తున్నారు. సినిమా సమర్పకుడు శశి కిరణ్ తిక్క ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే కూడా అందించారు. శ్రీ చరణ్ పాకాల ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi , e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950